

ఏలూరు ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 41.0
కనిష్ఠం : 26.0

హైబ్రిడ్ విధానంలో వైద్యసేవల యోచన

- క్యాన్సర్ నుంచి కార్డియాలజీ శస్త్ర చికిత్సల వరకు ఉచితంగానే..
- ఎన్టీఆర్ వైద్యసేవ జిల్లా కో-ఆర్డినేటర్ డాక్టర్ రాజీవ్

ఇంటర్వ్యూ..



ఏలూరు అర్బన్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఎన్టీఆర్ వైద్యసేవల పథకం కింద ప్రజలకు, ఉద్యోగుల ఆరోగ్య బీమా పథకం (ఈహెచ్ఎస్) కింద సర్వీసులో వున్న ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులకు, 70 ఏళ్ల పైబడిన వృద్ధుల ఆరోగ్య భద్రత కోసం కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ప్రధానమంత్రి జన్‌ఆరోగ్య యోజన (పీఎంజేఏవై) కింద జిల్లాలో ఇప్పటి వరకు అందిన వైద్యసేవలు, కొత్తగా ఈ పథకాల విస్తరణ, తదితర అంశాలపై ఎన్టీఆర్ వైద్యసేవ జిల్లా కో-ఆర్డినేటర్ డాక్టర్ రాజీవ్ శనివారం 'ఆంధ్రజ్యోతి'కిచ్చిన ఇంటర్వ్యూ ముఖ్యాంశాలివి..

ఉచిత వైద్య సేవల్లో నూతన సంస్కరణలు?

ప్రజల ఆరోగ్య సంరక్షణలో భాగంగా ఉచిత వైద్యసేవలను మరింత చేరువగా తీసుకెళ్లేందుకు త్వరలో హైబ్రిడ్ మోడ్‌లో చికిత్సలను అందించే విషయాన్ని ప్రభుత్వం పరిశీలిస్తోంది. నూతన విధానం వల్ల వైద్యచికిత్సల కోసం నెట్‌వర్క్ ఎంప్యానెల్‌మెంట్ ఆసుపత్రుల్లో చేరిన వెంటనే రూ.2.5 లక్షల వరకు వ్యయమయ్యే వైద్య చికిత్సలకు ప్రభుత్వం ఎంపికచేసిన ప్రైవేటు బీమా సంస్థల నుంచే అనుమ తులిచ్చే అవకాశం ఉంది. అంతకు మించిన వ్యయానికైతే ఇపుడున్న విధానంలోనే అనుమతులు ఇస్తారు. క్యాన్సర్ నుంచి కార్డియాలజీ శస్త్రచికిత్సల వరకు ఉచితంగానే చేస్తారు. ఈ నూతన విధానంపై ప్రభుత్వం తుదినిర్ణయం తీసుకోవాల్సి ఉంది.

జిల్లాలో ఎన్టీఆర్ వైద్యసేవలు అందించే ఆస్పత్రుల సంఖ్య?

జిల్లాలో 33 ప్రైవేటు ఆస్పత్రులు, 6 సీహెచ్‌సీలు, 2 ఏహెచ్‌లు, ఏలూరు ప్రభుత్వ సర్వజన ఆస్పత్రులను ఎన్టీఆర్ వైద్యసేవ నెట్‌వర్క్ ఆస్పత్రులుగా గుర్తించాం.

ఎన్టీఆర్ వైద్యసేవ కింద ఎన్‌రోల్‌మెంట్ అయిన వారి సంఖ్య?

ఎన్టీఆర్ వైద్యసేవ పథకం కింద జిల్లాలో 5,44,640 మంది ఎన్‌రోల్‌మెంట్ అయ్యారు. వీరితో పాటు ఈహెచ్ఎస్ సదుపాయంవున్న రెగ్యులర్, రిటైర్డ్ ఉద్యోగులు 28,290 మంది ఉన్నారు. గతేడాది జూన్ 1వతేదీ నుంచి ఈ ఏడాది మార్చి 1వతేదీ వరకు ఎన్టీఆర్ వైద్య సేవల కింద 11,500 మందికి శస్త్రచికిత్సలను రూ.22.75కోట్ల ఖర్చుభరించి ప్రభుత్వం నెట్‌వర్క్ ఆసుపత్రుల్లో వైద్యం చేయించింది. 3,700 మంది రెగ్యులర్, రిటైర్డ్ ఉద్యోగులకు రూ.3.35 కోట్లతో వైద్యచికిత్సలను అందించాం.

మెడికల్ రీయింబర్స్‌మెంట్ పెండింగ్‌కు కారణం?

ఉద్యోగుల మెడికల్ రీయింబర్స్‌మెంట్ బిల్లుల ప్రతిపాదనలు రూ.50 వేలు దాటితే గతంలో డీసీహెచ్ఎస్ స్థాయిలోనే పరిశీలించి ప్రభుత్వానికి పంపేవారు. దీనిని ఏలూరు ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి బదలాయించారు. ఇది ప్రభుత్వ వైద్యకళాశాల ఆస్పత్రిగా ఉంది. వైద్యనిపుణల కొరత కారణంగా మెడికల్ రీయింబర్స్‌మెంట్ ప్రతిపాదనలు పెండింగ్‌లో ఉండడానికి కారణమవుతోంది.

ఉచిత వైద్యసేవలపై ఆరోపణలు విన్పిస్తున్నాయి?

జిల్లాలో కొన్ని నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో ఎన్టీఆర్ వైద్యసేవ, ఈహెచ్ఎస్ కార్డులపై ఉచిత వైద్య సేవలు చేయడం లేదని వస్తున్న ఆరోపణల్లో కొంత వాస్తవం ఉంది. రోగుల నుంచి సొమ్ములు వసూలు చేస్తే తిరిగి ఇప్పించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించాం.

పీఎంజేఏవై పథకం వివరాలేమిటి?

70 ఏళ్ల పైబడిన వృద్ధులకోసం కేంద్రప్రభుత్వం పీఎంజేఏవై పథకాన్ని అమల్లోకి తెచ్చింది. గతంలో ఈ పథకం కుటుంబంలోని అందరికీ రూ.5లక్షల వరకు ఉచిత వైద్యసేవలు పొందేలా అమలు చేయగా, కొన్ని నెలలక్రితం కుటుంబంలోని ఒక్కో వ్యక్తికి రూ.5లక్షలు ఆరోగ్య బీమా వైద్యసేవలు పొందేలా విస్తరించారు. జిల్లాలో లక్ష మందిని చేర్చాలని లక్ష్యాన్ని నిర్దేశించగా, సాంకేతిక అవరోధాలు కొనసాగుతుండటం వల్ల ఇప్పటివరకు 20వేల మందిని మాత్రమే ఎన్‌రోల్ చేయగలిగాం.

రోగులకు ఇబ్బందులు ఏర్పడితే..?

ఎన్టీఆర్ వైద్యసేవలను అందించే నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో ఎక్కడైనా ఇబ్బందులు తలెత్తినా, నిర్లక్ష్యం వున్నా రోగులు నేరుగా 104 కాల్‌సెంటర్‌కు లేదా జిల్లా కో-ఆర్డినేటర్‌ను 98667 27254లో సంప్రదించి ఫిర్యాదు చేయవచ్చు.

అప్పులిచ్చి తిప్పలు

డీసీసీబీకి తలనొప్పిగా మొండి బకాయిలు



- రికవరీకి వెళ్తున్న సిబ్బందికి చుక్కలు
- మొండి బకాయిలు రూ.270 కోట్ల పైనే..

జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (డీసీసీబీ)కి మొండి బకాయిలు తల నొప్పిగా మారాయి. రికవరీలు కాక నిర్వహణ భారంగా నడుస్తోంది. గత పాలకుల ఒత్తిడితో వివిధ పథకాల కింద లబ్ధి దారులకు ఇచ్చిన రుణాలు వసూలు చేయడానికి తిప్పలు పడుతోంది. వైసీపీ ప్రభుత్వ నిర్వాకంతో సహకార బ్యాంకులు నష్టాల్లో కూరుకు పోయాయి.

(ఏలూరు-ఆంధ్రజ్యోతి) :

ఉమ్మడి జిల్లాలో 258 సహకార సంఘాల ద్వారా ఈ ఏడాది నాటికి మొండి బకాయిల రూపంలో సుమారు రూ.270 కోట్లు వసూలు కావాల్సి ఉంది. వీటిని చెల్లించేందుకు లబ్ధిదారులు మొఖం చాటేయడంతో రికవరీకి వెళ్లే సిబ్బంది ఉత్తచేతులతో తిరిగి వస్తున్నారు. రుణం తీసుకుని ఏర్పాటు చేసిన యూనిట్లు సైతం క్షేత్రస్థాయిలో కనిపించడం లేదు. చాలా వరకు యూనిట్లను అమ్మేసుకుని సొమ్ము చేసుకున్నారే తప్ప బ్యాంకులకు రుణాలు చెల్లించలేదు. ఉమ్మడి జిల్లాల్లో సొసైటీల కంప్యూటరీకరణ జరుగుతుండటంతో లెక్కలు ఒక్కొక్కటిగా బయటకు వస్తున్నాయి. ఈ నెలాఖరు నాటికి పూర్తిస్థాయిలో వాస్తవాలు వెలుగుచూసే అవకాశం ఉంది. ట్రాక్టర్ల రుణాలకు సంబంధించి లాంగ్ టర్మ్ కింద ఏటా బకాయిలు చెల్లించకపోతే పారు బకాయిలు (రాని బాకీలు) కింద లెక్క వేస్తారు. డిఫాల్టర్‌గా తేలితే ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకోవచ్చు. వారి ఆస్తుల ను జప్తు చేయవచ్చు. అధికారులు ఈ సాహసం చేసే పరిస్థితి లేదన్న విమర్శలు లేకపోలేదు.

రూ.90 కోట్లే వసూలు

జిల్లాలో గతేడాది డిసెంబరు నాటికి 258 సంఘాల పరిధిలో షార్ట్‌టర్మ్,లాంగ్‌టర్మ్ కింద రూ.360 కోట్ల వరకు రుణాలిచ్చారు. గత వైసీపీ హయాంలో జగనన్న తోడు పథకం పేరుతో చిరువ్యాపారులకు డీసీసీబీ నుంచి రూ.10 వేలు చొప్పున రుణాలు ఇప్పించారు. ఏడాదిలోగా వాటిని తిరిగి చెల్లించాల్సి ఉన్నా మూడేళ్లయినా ఆ ఊసే లేదు. ట్రాక్టర్లతో సహా వ్యవసాయ యాంత్రీకరణ రుణ పరికరాలను కస్టమ్ హైరింగ్ సెంటర్ల పేరుతో రూ.30 లక్షల నుంచి రూ.40 లక్షల విలువైన యూనిట్లను అందజేశారు. వాటిలో చాలావరకు ట్రాక్టర్లను అమ్మేసుకున్నారు. యంత్ర పరికరాలు కనిపించడం లేదు.రైతుల పేరుతో వైసీపీ నేతలే వాటిని సొంతం చేసుకోవడంతో రికవరీకి ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ఈ ఏడాది జనవరిలోనే వసూళ్లకు వెళ్లగా, మేనేజర్, డివిజన్ కోఆపరేటివ్ అధికారుల సహకారంతో ఎట్టకేలకు రూ.90 కోట్ల మేర మొండి బకాయిలు జమ అయ్యాయి.

రికవరీలు చేస్తాం..



జిల్లా స్థాయిలో రుణాల రికవరీపై ప్రత్యేక దృష్టి పెట్టాం. లాంగ్‌టర్మ్ రుణాల బకాయిలే ఎక్కువగా ఉన్నాయి. ఇవన్నీ వసూలు చేయడానికి అన్ని విధాలా ప్రయత్నిస్తున్నాం. మొండి బకాయిదారుల జాబితాల సొసైటీల వారీగా సేకరణ చేస్తున్నాం, నోటీసు బోర్డుల్లో పెట్టి వారి ఆస్తుల జప్తునకు చర్యలు తీసుకుంటాం.

– పి.సింహాచలం, డీసీసీబీ సీఈవో

'ప్రైవేటు' ఉచిత ప్రవేశాలకు షెడ్యూలు విడుదల

ఏలూరు అర్బన్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : ఉచిత నిర్బంధ విద్యాహక్కు చట్టం కింద జిల్లాలోని అన్ని ప్రైవేట్ అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో 25 శాతం సీట్లకు ప్రవేశాలు పొందేందుకు షెడ్యూలు జారీ అయిందని సమగ్రశిక్ష జిల్లా ఏపీసీ కె.పంకజ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొంటున్న వర్గాలకు చెందిన (అనాథలు, హెచ్ఐవీ బాధితుల పిల్లలు, దివ్యాంగులు) పిల్లలకు 5శాతం, ఎస్సీలకు 10శాతం, ఎస్టీలకు 4శాతం, బలహీన వర్గాలకు (బీసీ, మైనార్టీ, ఓసీ) చెందిన పిల్లలకు 6శాతం సీట్లను కేటాయిస్తారని వివరించారు. అర్హతలు కలిగిన పిల్లలకు 25 శాతం సీట్లను కేటాయించి ఫీజును ప్రైవేట్ అన్‌ఎయిడెడ్ పాఠ శాలలకు ప్రభుత్వం చెల్లిస్తుందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో రూ.1.20లక్షలు, పట్టణ ప్రాంతాల్లో రూ.1.44 లక్షల కుటుంబ వార్షికాదాయంగల పిల్లలకు ఈ పథకం వర్తిస్తుందని తెలిపారు. బాలబాలికలు ఈ నెల 28 నుంచి మే 15 వరకు ఆన్‌లైన్ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవాలని, జీఎస్‌డబ్ల్యూఎస్ డేటా ద్వారా అర్హతలు గల పిల్లలను గుర్తించే ప్రక్రియ మే 20లోగా, లాటరీ విధానం ద్వారా తొలివిడత ఎంపికల జాబితా విడుదల మే 21నుంచి 24 వరకు, రెండోవిడత ఎంపికల జాబితాను జూన్ 6న విడుదల చేస్తారన్నారు.

రేపే టెన్త్, 'ఓపెన్' ఇంటర్ ఫలితాలు

పదో తర గతి పబ్లిక్ పరీక్షల ఫలితాలు బుధవారం ఉదయం 10గంటలకు విడుదల కానున్నాయి. విద్యాశాఖ అధికారిక వెబ్‌సైట్లు బీఎస్ఈ.ఏపీ.జీవోవీ.ఐఎన్, ఏపీఓపెన్ స్కూల్.ఏపీ. జీవోవీ.ఐఎన్‌లతోపాటు, మనమిత్ర వాట్సాప్ నెంబరు 95523 00009లోను, లీప్ మొబైల్ యాప్‌లో ఉపాధ్యా యుల, విద్యార్థుల లాగిన్‌లోను ఫలితాలు అందుబాటులో ఉంటాయి. ఈ ఏడాది మార్చిలో జరిగిన ఎస్ఎస్‌సీ పరీ క్షలు, ఓపెన్ స్కూల్స్ టెన్త్, ఇంటర్ పరీక్షల ఫలితాల కోసం విద్యార్థులు వారి రోల్ నెంబరును నమోదు చేయడం ద్వారా ఫలితాల పీడీఎఫ్ కాపీని పొందవచ్చు. జిల్లాలో టెన్త్ పరీక్షలకు 25,179 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు.

ఏలూరు సమ్మర్ స్టోరేజ్ ట్యాంకుకు గండి

ఏలూరు టూటౌన్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : ఏలూరు నగరంలో రెండున్నర లక్ష మంది జనాభాకు తాగునీరందించే సమ్మర్‌స్టోరేజ్ ట్యాంకుకు సోమవారం తెల్లవారుజామున గండి పడింది. నీరంతా చుట్టుపక్కల పొలాల్లోకి వెళ్లడంతో రైతుల ఫిర్యాదు మేరకు ఎమ్మెల్యే బడేటి చంటి, కోఆప్షన్ సభ్యుడు ఎస్ఎంఆర్ పెదబాబు, కమిషనర్ ఎ.భానుప్రతాప్, ఇరిగేషన్ అధికారులు చెరువు వద్దకు చేరుకున్నారు. ఎక్స్‌కవేటర్‌తో మట్టితోడి సిమెంటు, ఇసుకబస్తాలు, రాళ్ళు, ఆ గండిపడిన ప్రదేశంలో వేసి సాయంత్రానికి కష్టపడి గండిని పూడ్చారు. ఎమ్మెల్యే చంటి మధ్యాహ్నం వరకు అన్ని కార్యక్రమాలు రద్దు చేసుకుని దగ్గరుండి పనులు పర్యవేక్షించారు. నిన్న మొన్నటి వరకు చెరువులో తాగునీరు అడుగంటింది. గోదావరి నదిలో నీరులేక సమ్మర్ స్టోరేజ్ ట్యాంకును నింపలేకపోయారు. దీనిపై ఎమ్మెల్యే చంటి అసెంబ్లీలోను ఈ విషయాన్ని లేవనెత్తారు. మరుసటి రోజు జిల్లా కలెక్టర్, ఇరిగేషన్, మున్సిపల్ అధికారులను సమన్వయపరిచి చెరువులోకి నీరు తోడేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అయినప్పటికి గోదావరి కాల్వలో అరకొరగా వస్తుండడంతో చెరువు నింపడానికి సాధ్యంకాలేదు. ఈలోగా ఏప్రిల్ 15 నుంచి కాల్వలు మూసివేస్తామని ప్రభుత్వం ప్రకటించటంతో ఎమ్మెల్యే చంటి రంగంలో దిగి ఇరిగేషన్ మంత్రి నిమ్మల రామానాయుడుతో చర్చలు జరిపి ఈనెల 22వరకు కాల్వల్లో నీటిని కొనసాగించేందుకు చర్యలు చేపట్టారు. పాతమోటార్లతో పాటు మరికొన్ని కొత్త మోటార్లు కొని గోదావరి కాల్వలో నీటిని తోడి చెరువు నింపుతున్నారు. చెరువులో నీరు రెండు అడుగులు పెరిగింది. పర్వాలేదనుకున్న తరుణంలో చెరువుకు గండిపడింది. దీంతో వేసవిలో నీరందుతుందా.. లేదా అని నగరవాసలు ఆందోళన చెందుతున్నారు.

ఇంత నిర్లక్ష్యమా..?

రెండున్నర లక్షల మందికి రెండుపూటల తాగునీరిందించే చెరువు మెయిటినెన్స్ పట్ల అధికారులు ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రతీరోజు మున్సిపల్ అధికారులు, ఇరిగేషన్ అధికారులు చెరువును పర్యవేక్షించాలి. కానీ క్షేత్రస్థాయి అధికారులు పర్యవేక్షణ లోపం వల్ల గండిపడింది. దీనిపై విచారణ జరిపి వారిపై కఠినచర్యలు తీసుకోకపోతే భవిష్యత్తులో మరింత ప్రమాదాలు జరిగే అవకాశాలున్నాయని ప్రజలు భావిస్తున్నారు. 2005లో 117 ఎకరాల్లో సమ్మర్ స్టోరేజ్ ట్యాంకును నిర్మించారు. చెరువు ప్రారంభించి ఇరవై ఏళ్ల అయ్యింది. చెరువుగట్లు బలహీనపడ్డాయి. వాటిని పటిష్టం చేయాల్సిన అవసరం ఉంది.



గండి పూడ్చివేత పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే చంటి

నియోజకవర్గాల్లో ఇసుక స్టాక్ పాయింట్లు

- కాల్వలకు ఈ నెల 25 వరకు నీటి సరఫరా
- ఉపాధి పనిదినాలు మరింత పెంచాలి
- జిల్లా అధికారుల సమావేశంలో ఇన్‌చార్జి మంత్రి నాదెండ్ల మనోహర్



కలెక్టరేట్‌లో సోమవారం రాత్రి నిర్వహించిన జిల్లా అధికారుల సమీక్షలో మాట్లాడుతున్న మంత్రి నాదెండ్ల మనోహర్.. చిత్రంలో మంత్రి కొలుసు పార్థసారథి, కలెక్టర్ వెట్రిసెల్వి

■ లోపలి పేజీలో..

అధికారితో..

ఆంధ్రజ్యోతి ఫోన్ ఇన్

పశువుల ఆసుపత్రులలో డాక్టర్ల కొరత, సిబ్బంది నిర్లక్ష్యం, పశువులకు సరైన వైద్యం అందకపోవడం, వైద్యులు, సిబ్బంది సకాలంలో విధులకు హాజరు కాకపోవడం, సరిగా మందులు ఇవ్వక పోవడం, పశువుల వ్యాధులపై 23వ తేదీ బుధవారం ఉదయం 11-12 గంటల మధ్య 'ఆంధ్రజ్యోతి ఫోన్ ఇన్' నిర్వహించనుంది. పాడి, పశువుల రైతులు 99899 32844 నెంబరుకు ఫోన్ చేసి సమస్యలను వివరిస్తే.. వాటి పరిష్కారానికి పశు సంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ టి.గోవిందరాజు చర్యలు తీసుకుంటారు.

దమ్ముంటే పట్టుకోరా షెకావత్ !

పట్టుకుంటే వదిలేస్తా సిండికేట్.. అక్రమ మట్టి తోలకాలపై సోషల్ మీడియాలో తెలుగు తమ్ముళ్ల రచ్చ



స్వాధీనం చేసుకున్న ఎక్స్‌కవేటర్

నూజివీడు, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): నూజివీడు నియోజకవర్గంలో అక్రమ మట్టి తోలకాలు తెలుగు తమ్ముళ్ళ మధ్య చిచ్చు రేపాయి. ఏలూరు జిల్లా చాట్రాయి మండలం పోలవరంలో అక్రమ మట్టి తోలకాల్లో తెలుగుదేశంకు చెందిన రెండు గ్రూపుల నాయకుల మధ్య వివాదం మొదలైంది. అక్రమంగా తోలుకుంటున్న మట్టి ట్రాక్టర్లను ఒకరి ట్రాక్టర్‌ను మరొకరు పోలీసులకు పట్టించడంతో రెండు గ్రూపులు రచ్చకెక్కాయి. పరువు పోతుందనే ఉద్దేశంతో పార్టీ నాయకులు కేసులు లేకుండా వాహనాలను పిలిపించారు. గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న వ్యాపార భారీ షెడ్లకు గ్రామం లోని ఒక చెరువు నుంచి మట్టిని నిబంధనలకు విరుద్ధంగా తోలుతున్నారు. దాదాపు పది వేల ట్రాక్టర్లు మట్టి అవసర మయ్యే ఈ భారీ నిర్మాణ పనిలో మట్టి సరఫరా కోసం రెండు గ్రూపుల మధ్య వివాదం ఏర్పడింది. ఒక గ్రూపునకు చెంది న పట్టుబడిన మట్టి ట్రాక్టర్లను ఇటీవలే ఎలాంటి కేసు లేకుండా విడిపించారు. అనంతరం ఆ గ్రూపునకు చెందిన నాయకులు ప్రత్యర్థిని సవాల్ చేస్తూ సోషల్ మీడియాలో మట్టిని ట్రాక్టర్లో లోడ్ చేస్తున్న వీడియోకు వాయిస్ ఓవర్‌లో పుష్పా సినిమాలోని డైలాగును ఉదహరిస్తూ 'దమ్ముంటే పట్టుకోరా షెకావత్.. పట్టుకుంటే వదిలేస్తా సిండికేట్' అనే డైలాగ్‌తో పోస్టు చేశారు. ఈ పోస్టింగ్ నియోజకవర్గంలో తీవ్ర చర్చనీయాం శమవుతోంది. ప్రస్తుతం నూజివీడు నియోజకవర్గంలో నెలకొన్న రాజకీయ పరిస్థితి, అధికారపార్టీ స్థానిక నేతలు వ్యవహరిస్తున్న తీరు గతంలో ఎన్నడూ లేని విధంగా ఉందని, అన్ని రాజకీయపార్టీల నాయకులు భావిస్తున్నారు.

అధికారుల ఉబ్బితబ్బిబ్బు

తాంబూలం ఇచ్చాం తన్నుకు చావండి.. అన్న చందాన అధికార పార్టీలో ఉన్న గ్రూపుల కారణంగా పలుశాఖల అధికారులకు కాసులు గలగలమంటూ ఉండటంతో ఆ శాఖలు ఉబ్బితబ్బిబ్బు అవుతున్నాయి. గ్రావెల్, మట్టి, బెల్టుషాపుల్లో జరుగుతున్న విచ్చలవిడి అవినీతి ఆయా శాఖలకు వరంగా మారింది. మీకు కావాల్సింది తీసుకోండి కేసులు వద్దంటూ అధికార పార్టీ నేతలు ఆయా శాఖల అధికారులు చెప్పడంతో అధికారులు సొమ్ము చేసుకుంటున్నారు. ప్రజలు ఈ మాఫియా వల్ల పడుతున్న ఇబ్బందుల గురించి ఫోన్‌ల ద్వారా సమాచారం ఇచ్చినా ఎలాంటి చర్యలు తీసుకోకపోవడానికి ఇదే ప్రధాన కారణమని విమర్శలు విన్పిస్తున్నాయి.

మంత్రి సారథి సీరియస్

అక్రమ మట్టి తోలకాలపై ఆంధ్రజ్యోతి వరుసగా కథనాలు ఇస్తుండటంతో అసలు నియోజకవర్గంలో ఏం జరుగుతోందంటూ మంత్రి కె.పార్థసారథి పార్టీ నాయకులను మందలించారు. గ్రామాల్లో మట్టితోలకాలు జరుగుతోంటే వెంటనే ఆపి వేయాలని అటు అధికారులకు, ఇటు పార్టీ నేతలకు ఆయన ఆదేశాలు ఇచ్చారు. ఈ నేపథ్యంలో సోమవారం టిప్పర్లు, ట్రాక్టర్లు రోడ్డు ఎక్కలేదు.

మట్టి తవ్వకాలపై విజిలెన్స్ విచారణ

నూజివీడు, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): ఆగిరిపల్లి మండలం నరసింగపాలెంలో మట్టి మాఫియా అక్రమ మట్టి తోలకాలను అడ్డగించిన ఆ గ్రామ ప్రజలను.. ఈ మట్టి సీఎం ఇంటికి అడ్డొస్తే తొక్కించేస్తాం.. అని బెదిరించిన ఘటనపై రాష్ట్రప్రభుత్వం సీరియస్‌గా ఉన్నట్టు తెలిసింది. ఇప్పటికే ఇంటెలిజెన్స్ నుంచి సమాచారం సేకరించింది. పట్టుబడిన ఎక్స్‌కవేటర్‌ను ఆదివారం ఆగిరిపల్లి తహసీల్దార్ కార్యాలయానికి తరలించారు. మరింత లోతుగా దర్యాప్తు చేయడానికి విజిలెన్స్ విచారణకు ఆదేశించినట్టు సమాచారం. ఈ మేరకు ఒకటి, రెండురోజుల్లో విజిలెన్స్ విచారణ జరపనున్నట్టు తెలిసింది.

కొల్లేరును ఐదు నుంచి మూడో కాంటూరుకు ..

ఎందుకు కుదించకూడదు..

- సీఈసీని నివేదిక కోరిన సుప్రీంకోర్టు
- కాంటూరు కుదింపు చేస్తే సుమారు 44 వేల ఎకరాలు భూములు ప్రజలకు..




కైకలూరు, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి):కొల్లేరు ప్రజలను ఆదుకునేందుకు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ప్రయత్నాలు చేస్తుండగా మరోవైపు సుప్రీంకోర్టు కాంటూరు కుదింపు అంశాన్ని పరిశీలించ మనడంతో కొల్లేరువాసుల్లో కొత్త ఆశలు చిగురిస్తున్నాయి. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం కొల్లేరు ప్రజల జీవన స్థితిగతులను, ఇక్కడ పడుతున్న ఇబ్బందులను సుప్రీంకోర్టుకు తెలిపేందుకు ఇంప్లీమెంటేషన్ పిటీషన్ వేసింది. ఈ పిటీషన్‌తో కొల్లేరు ప్రజల్లో న్యాయం జరుగుతుందని భావిస్తున్న తరుణంలో ఈనెల 16న సుప్రీంకోర్టు కొల్లేరు ప్రజల జీవన స్థితిగతులపై 12 వారాల గడువు ఇచ్చి నివేదిక అందజేయాలని సీఈసీ (సెంట్రల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ కమిటీ)ని కోరింది. ఇదిలా ఉండగా మరోసారి కొల్లేరుపై ఆలోచన చేసిన సుప్రీంకోర్టు కొల్లేరు సరస్సు 5వ కాంటూరు పరిధిలో 77,138 ఎకరాలు విస్తీర్ణం ఉండగా 3వ కాంటూరుకి ఎందుకు తగ్గించ కూడదంటూ సోమవారం సీఈసీని మరోసారి నివేదిక అడిగింది. కాంటూరు కుదింపు సాధ్యపడితే సుమారుగా 44 వేల ఎకరాల భూమి ప్రజలకు అందుతుంది. గత 26 ఏళ్లుగా ఎన్నో ఒడిదుడు కులను ఎదుర్కొంటున్న కొల్లేరు ప్రజలకు సుప్రీంకోర్టు కోరిన నివేదిక ఎంతో మేలు చేస్తుంది. ఇప్పటి వరకు నేషనల్ వైల్డ్‌లైఫ్ బోర్డు 22 వేల ఎకరాలు తగ్గించాలని ఆలోచన చేస్తున్న తరుణంలో సుప్రీంకోర్టు కాంటూరును కుదించి రెట్టింపు భూములను ప్రజలకు అందించేలా సీఈసీని నివేదిక కోరింది. కొల్లేరులో పర్యావరణ పరిరక్షణతో పాటు మానవాళి మనుగడకు కావాల్సిన చర్యలను సుప్రీంకోర్టు పరిగణనలోనికి తీసుకోవడంతో ఊహించని రీతిలో కాంటూరు కుదింపుపై దృష్టి పెట్టడం ఆ ప్రాంత ప్రజలకు లబ్ధి చేకూరుతుంది. ఇప్పటివరకు అనేకమంది కొల్లేరు పర్యావరణాన్ని పరిరక్షించాలంటూ పలుమార్లు సుప్రీం కోర్టులో కేసులు వేయగా ఇక్కడ ప్రజలు పడుతున్న బాధలను సుప్రీంకోర్టు దృష్టికి తీసుకువెళ్లిన వారు లేకపోవడంతో ఆ ప్రాంత ప్రజల జీవనోపాధి దినదిన గండంగా గడుస్తోంది. ఎప్పుడు కొల్లేరులో నుంచి ప్రజలను బయటకు పొమ్మంటారో, ఉండమంటారో, పేదలకు భూములు ఇస్తారో లేదో తెలియక సతమతమవుతున్న ప్రజలకు తాజాగా సుప్రీంకోర్టు కాంటూరు కుదింపును తెర మీదకు తీసుకురావడం తీపి కబురే. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కైకలూరు ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ కొల్లేరువాసులకు శాశ్వత పరిష్కారమందిస్తామంటూ పదే పదే చెప్పడం, అందుకు తగినట్లుగా ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ సమస్యను పరిగణనలోకి తీసుకోవడంతో ప్రజల తరఫున ప్రభుత్వం సుప్రీంకోర్టులో వాదనలు వినిపించింది. సుప్రీం సూచనలతో కాంటూరు కుదింపు అంశం సీఈసీ కమిటీ క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి సాధ్యసాధ్యాలను పరిశీలిస్తే ప్రజలకు 44 వేల ఎకరాల భూమి అందుతుంది. కొల్లేరు సరస్సు 33,138 ఎకరాలకు పరిమితమవుతుంది. ఈ విస్తీర్ణంలోని సరస్సులో పర్యావరణం, పక్షుల మనుగడకు సరిపోతుందని గతంలోనే అనేక మంది పేర్కొన్నారు. అదే అంశం సుప్రీంకోర్టు పరిగణ నలోకి తీసుకోవడం కొల్లేరు ప్రజలు కల సాకారం కానుంది. ఇక్కడ పరిస్థితులను తెలుసుకునేందుకు సీఈసీ కమిటీ క్షేత్రస్థాయిలో పర్యటించనుంది.

ప్రధాని అవార్డు అందుకున్న ప్రసన్న వెంకటేశ్



ఏలూరు, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి):దేశంలో అత్యంత ప్రతిష్టాత్మకమైన ప్రధాన మంత్రి అవార్డు (2023)ను ఏపీఎస్ డబ్ల్యూ ఆర్ఈఐఎస్ సెక్రటరీ, ఏలూరు జిల్లా పూర్వపు కలెక్టర్ వి.ప్రసన్న వెంకటేశ్ ఢిల్లీలో ప్రధానమంత్రి చేతుల మీదుగా సోమవారం అందుకు న్నారు. 2022 నుంచి జూలై 2024 వరకు ఏలూరు జిల్లా కలెక్టర్‌గా పని చేసిన కాలంలో ప్రభుత్వ పథకాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లడం, స్థిరమైన అభివృద్ధి, మహిళలు, బాలికల్లో రక్తహీనత నివారణకు కృషి చేశారు. సామాజిక బాధ్యత, చొరవ కింద జిల్లాలోని ఏజెన్సీ మండలాల్లో అక్షజ అనే కార్యక్రమంతో గర్భిణులు, ప్రసూతి మహిళల ఆరోగ్య సంరక్షణకు పాటుపడ్డారు. ఉత్తమ పరిపాలన అందించిన పది మంది కలెక్టర్లను కేంద్రం గుర్తించి అవార్డు అందించగా వారిలో ప్రసన్న వెంకటేశ్ ఒకరు.



శేఖర్‌బాబుకు శుభాకాంక్షలు తెలుపుతున్న ఆర్ఐవో

డీఐఈవోగా శేఖర్‌బాబు బాధ్యతల స్వీకరణ

ఏలూరు అర్బన్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి (డీఐఈవో)గా పదోన్నతిపై నియమితులైన టి.శేఖర్‌బాబు సోమవారం ఏలూరులోని తన కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుతం గుంటూరు జిల్లా పెనుమాక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా ఈయన వ్యవహరిస్తున్నారు. ఇప్పటివరకు ఇన్‌చార్జి డీఈఈవోగా పనిచేసిన ప్రభాకరరావు నుంచి శేఖర్‌బాబు బాధ్యతలు స్వీకరించారు. కాగా ప్రభాకరరావు నారాయణపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా తిరిగి బాధ్యతలు స్వీకరించారు. ఆ వెంటనే ఆయనను ఎన్టీఆర్ జిల్లాకు డీఐఈవోగా ఎఫ్ఏసీ హోదాలో నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఇంటర్మీడియట్ విద్యలో సంస్కరణల్లో – మిగతా 8లో





కలువ పూల సోయగం

దెందులూరు మండలం దోసపాడు మంచినీటి చెరువులో వికసించిన కలువ పూవులు చూపరుల్ని విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. తామర ఆకులతో పచ్చదనం అలుముకున్న చెరువుకి వికసించిన తామర పూలు మరింత అందాన్ని తెచ్చాయి.. ఈ రమణీయ దృశ్యాలను పలువురు చూసి ముగ్ధులవుతున్నారు..

-ఫొటోగ్రాఫర్, ఏలూరు



చైతన్య భారతి జాతీయస్థాయి నాటిక పోటీల బ్రోచర్లను ఆవిష్కరిస్తున్న పరిషత్ సభ్యులు

24 నుంచి చైతన్య భారతి జాతీయస్థాయి నాటిక పోటీలు

4 రోజులు..10 నాటికల ప్రదర్శన

భీమవరం అర్బన్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): చైతన్య భారతి సంగీత నృత్య నాటక పరిషత్ ఆధ్వర్యంలో ఈనెల 24, 25, 26, 27 తేదీల్లో భీమవరం డీఎన్ఆర్ కళాశాల గన్నాబత్తుల క్రీడా మైదానంలో జాతీయస్థాయి నాటిక పోటీలను నిర్వహిస్తున్నట్లు పరిషత్ అధ్యక్షుడు రాయప్రోలు భగవాన్ తెలిపారు.నాలుగు రోజుల పాటు జరిగే నాటిక పోటీలలో 10 నాటికలను ప్రదర్శించనున్నారు. చైతన్య భారతి 18వ జాతీయస్థాయి నాటిక పోటీల బ్రోచర్లను సోమవారం ఆవిష్కరించారు. 24వ తేదీన నాటక పోటీలను కేంద్ర సహాయక మంత్రి భూపతి రాజు శ్రీనివాసవర్మ, డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణంరాజు, భీమవరం ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు, జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణిలు ప్రారంభిస్తారన్నారు. ప్రముఖ సినీ నటుడు రావు రమేష్ సీనీ, రంగస్థల నటుడు ఎస్కే మిత్రా, ప్రముఖ రంగస్థల నటీమణి మణి బాలకు రంగస్థల చైతన్య పురస్కారాలు, రంగస్థల నటుడు బాలాజీ నాయక్, చవ్వాకుల సత్యనారాయణ, సినీ దర్శకుడు వివేక్ ఆత్రేయలకు ఆత్మీయ సత్కారం జరుగుతాయని వివరించారు. ముగింపు కార్యక్రమానికి శాసన మండలి ఛైర్మన్ కొయ్యే మోషేన్ రాజు, మంత్రులు కందుల దుర్గేష్, నిమ్మల రామానాయుడు, అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి హాజరవుతున్నారన్నారు. సమావేశంలో పరిషత్ సభ్యులు వబిలిశెట్టి శ్రీవెంకటేశ్వరరావు, రాయప్రోలు శ్రీనివాసమూర్తి, బోండా రాంబాబు, భట్టిప్రోలు శ్రీనివాసరావు, డాక్టర్ కట్రెడి సత్యనారాయణ, పేరిచర్ల లక్ష్మణవర్మ, పెన్నాడ శ్రీను, నడింపల్లి మహేష్, తదితరులు పాల్గొన్నారు.

పద్మ పురస్కారాలకు క్రీడాకారుల నుంచి దరఖాస్తుల ఆహ్వానం

ఏలూరు రూరల్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): భారత ప్రభుత్వం ప్రతీ సంవత్సరం గణతంత్ర దినోత్సవ వేడుకలలో భాగంగా అందించబోవు అత్యున్నత పద్మ పురస్కారాలకై 2026వ సంవత్సరానికి క్రీడాకారులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా క్రీడాభివృద్ధి అధికారి బి.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో కోరారు. వివరాలకు www.padma awards.gov.in వెబ్‌సైట్‌లో పొందవచ్చనన్నారు. ఈ వెబ్‌సైట్‌లో క్రీడాకారులు వ్యక్తితంగా దరఖాస్తు చేసుకొని వాటిని పీడీఎఫ్, వార్డ్ ఫార్మేట్‌లలో స్పోర్ట్షిఇన్ ఏపీ జీమెయిల్.కామ్, ఇన్‌సెంటీవ్స్.స్కీమ్స్ జీమెయిల్.కామ్‌లో మే 26 తేదీ సాయంత్రం 5 గంటలలోగా పంపాలని తెలిపారు. అర్హులైన క్రీడాకారుల జాబితాను కేంద్ర ప్రభుత్వం సిఫారసు చేస్తుందన్నారు. అంతర్జాతీయ క్రీడలలో ప్రతిభాపాటవాలను చూపుతున్న జిల్లా క్రీడాకారులు కేంద్ర ప్రభుత్వంచే తగిన గుర్తింపు కోసం ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.



ఏలూరు సీఆర్ రెడ్డి కళాశాలలో అంతర్జాతీయ సదస్సును ప్రారంభిస్తున్న దృశ్యం

సాంకేతికతతో పరిశోధనలు విస్తృతం

పెదపాడు, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : సాంకేతికతతో పరిశోధనలు విస్తృతం చేయాలని, బయో మెడికల్ సిగ్నల్స్, వాటిని ప్రాసెసింగ్ చేయడానికి ఆధునిక పరికరాలను ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్, మెషిన్ లెర్నింగ్ ద్వారా భవిష్యత్తులో అతిచిన్న సైజులో మెడికల్ పరికరాలను డిజైన్ చేయవచ్చునని, నాన్ ఇన్‌వేజివ్ పద్ధతిలో చేయడానికి ప్రభుత్వ అనుమతి కూడా అవసరం లేదని ఐఐటీ రూర్కి ప్రొఫెసర్ డాక్టరు సుదేప్‌దాస్ గుప్త తెలిపారు. పెదపాడు మండలం వట్లూరు సర్‌సీఆర్ రెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో బయో మెడికల్ ఇంజనీరింగ్ మీద అంతర్జాతీయ సదస్సు సోమవారం ప్రారంభించారు. జెఎన్‌టీయూ ప్రొఫెసర్ డాక్టరు ఎన్. బాలాజీ, పాండిచ్చేరి టెక్నాలజీ విశ్వవిద్యాలయానికి చెందిన డాక్టరు ఆర్.సంతానలక్ష్మి, మను సెంట్రల్ విశ్వవిద్యాలయానికి చెందిన డాక్టరు ఎ.రవి, అన్నామలై విశ్వ విద్యాలయం నుంచి డాక్టరు వి.ఆర్.శర్మలు పాల్గొని బయో మెడికల్ ఇంజనీరింగ్‌పై వివరించారు. సీఆర్‌రెడ్డి విద్యాసంస్థల కార్యదర్శి డాక్టరు ప్రసాద్ మాట్లాడుతూ బయో మెడికల్ అద్భుతమైన అంశమని, ప్రస్తుత ఆధునిక కాలంలో సాంకేతికతతో అరికట్టలేని వ్యాధి లేదన్నారు. ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరావు, ఈసీఈ హెచ్‌వోడీ తేజోమూర్తి తదితరులు పాల్గొన్నారు.

స్లాట్ బుకింగ్‌లోనూ అవస్థలు

ఒక్కసారిగా తగ్గిన రిజిస్ట్రేషన్‌లు

సిబ్బందికి అంతంత మాత్రమే అవగాహన

కక్షిదారుల్లో అసహనం



ఆచంట, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వానికి రోజూ రిజిస్ట్రేషన్ శాఖ ద్వారా కోట్ల రూపాయలు ఆదాయం వస్తుంది.అటువంటి ఆదాయం వచ్చే శాఖపై ప్రభుత్వం కొత్త విధానాన్ని తీసుకువస్తుండటంతో అటు అధికారులకు, ఇటు కక్షిదారులకు ఇబ్బందులు తరచూ తలెత్తుతూనే ఉన్నాయి. రిజిస్ట్రేషన్‌కు సంబంధించి తరచూ కొత్త విధానాలు తీసుకురావడంతో రిజిస్ట్రేషన్‌లు సజావుగా జరగడం లేదు. దీనివల్ల ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతోంది. అమ్మకం, కొనుగోలు దారులు కూడా ఇబ్బందులు పడుతూనే ఉన్నారు. గత ప్రభుత్వం రిజిస్ట్రేషన్ శాఖకు సంబంధించి 2.0 కొత్త విధానాన్ని తీసుకువచ్చింది. మొదట్లో అనేక మంది ఈ విధానం వ్యతిరేకించినప్పటికి ప్రస్తుతం ఈ విధానానికి అలవాటుపడి రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయి. ఇటీవల రిజిస్ట్రేషన్‌కు సంబంధించి ప్రభుత్వం స్లాట్ బుకింగ్ విధానాన్ని తీసుకువచ్చింది. ఈ విధానంపై కక్షిదారులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కొత్త విధానంపై కనీసం సిబ్బందికే పూర్తి అవగాహన లేనపుడు కక్షిదారులకు ఇంకెలా అర్థమవుతుందని విమర్శలు వినపడుతున్నాయి. సరిగ్గా స్లాట్ బుకింగ్ సమయానికి కక్షిదారులు కార్యాలయంలో ఉండాల్సి ఉంటుంది. అయితే ఒక్కోసారి సర్వర్ సమస్య వచ్చినపుడు కూడా స్లాట్‌బుక్కింగ్ చేసినప్పటికి ఉపయోగం ఉండదు. ఈ స్లాట్ బుక్కింగ్ వల్ల గంటకు కేవలం ఆరు దస్తావేజులు మాత్రమే అవుతాయి. ప్రభుత్వం కొత్త విధానం తీసుకువచ్చినపుడు సంబంధిత సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో సిబ్బందితో కక్షిదారులకు అవగాహన కల్పిస్తే కొంత వరకు ఫలితం వస్తుందని కొంతమంది అంటున్నారు. స్లాట్ బుక్కింగ్ విధానం అమలులోకి రావడంతో సోమవారం జిల్లావ్యాప్తంగా పది హేను కార్యాలయాలకు సంబంధించి సుమారు 150 రిజిస్ట్రేషన్‌లు మించి అవనట్లు సమాచారం. మామూలు రోజుల్లో సోమవారం అయితే జిల్లా వ్యాప్తంగా సుమారు 500లకు పైగానే రిజిస్ట్రేషన్‌లు జరిగేవి. ఈ విధానంతో ఒక్కసారిగా ఆయా కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్‌ల సంఖ్య కూడా తగ్గిపోయింది. ఈ స్లాట్ బుకింగ్ విధానంపై అధికారులు పునరాలోచించాలని లేకపోతే అన్ని కార్యాలయాల్లో కూడా సిబ్బందితో అవగాహన కల్పించాలని పలువురు కోరుతున్నారు.



భూమాతా.. మన్నించు !

భూమికి పొంచి ఉన్న ముప్పు

రొయ్యల సాగుతో తగ్గుతున్న భూసారం

ప్లాస్టిక్ వ్యర్థాలతో అనర్థాలెన్నో

2050 నాటికి కొన్ని రకాల పంటలే

2040 నాటికి ప్లాస్టిక్ ఉత్పత్తులు 60 శాతానికి తగ్గాలి

నేడు ప్రపంచ ధరిత్రీ దినోత్సవం



పాలకొల్లు, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : మానవ సమాజం ఎటువైపు పోతున్నదీ ఒకవైపు రాజకీయ కక్షలు కార్పణ్యాలు ఒకవైపు కులాల మతాల కీచులాటలు..ఇవి చాలవన్నట్లు జనంలో నానాటికీ పెరుగుపోతున్న వ్యక్తిగత స్వార్థం.. వెరసి మనిషన్నవాడు పర్యావరణం అనే పదాన్ని పూర్తిగా మరిచిపోయే పరిస్థితి వచ్చేసింది. ఒకవైపు భూతాపాన్ని పెంచేస్తున్న ప్లాస్టిక్ వ్యర్థాలు... మరోవైపు భూసారాన్ని తగ్గించేస్తున్న రసాయన వ్యర్థాలు, మానవ తప్పిదాలతో నానాటికి క్షీణించిపోతున్న వృక్ష సంపద భూమి ఉనికిని ప్రశ్నించే స్థాయికి వచ్చాయి. పశ్చిమగోదావరి జిల్లాలో ఇప్పటికే 40 శాతం భూమి కాలుష్య కోరల్లోకి వెళ్లిపోయింది. సంపద సృష్టి క్రమంలో రైతులు హరిత వనాలను వదిలి నీలి విప్లవం వైపు పరుగు తీయడంతో భూమికి ప్రమాదం ఏర్పడింది. ఇటీవల పలువురు శాస్త్రవేత్తలు పశ్చిమ గోదావరిలో భూసారంపై ఆందోళనకర మైన వ్యాఖ్యలు చేయడం గమనార్హం. జిల్లాలో తగ్గుతున్న ఉద్యాన వనాలు పెరుగుతున్న రొయ్యల చెర్వులు కారణంగా భవిష్యత్తు రోజులలో జిల్లాలో తాగునీరు దొరకని పరిస్థితి ఏర్పడుతుందని శాస్త్రవేత్తలు అభిప్రాయ పడటం ఆందోళన కల్గించే అంశం.నేడు ప్రపంచ ధరిత్రి దినోత్సవం సందర్భంగా ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం

ధరిత్రిని కాపాడడం ఎలా

ఇటీవల కాలంలో మొక్కలు నాటడం, సేంద్రియ వ్యవసాయ పద్ధతులు అమలు చేయడం కొంతమేరకు భూమికి మేలు చేస్తుంది. మొక్కల నాటడం ద్వారా పర్యావరణానికి మేలు కలగటమే కాకుండా భూసారం పెరుగుతుంది. ఇటీవల వ్యవసాయ ఉత్పత్తులు పెంచుకోవడానికి రైతులు అధికంగా రసాయన ఎరు వులు వినియోగిస్తున్నారు. రసాయన ఎరు వులతో తాత్కాలిక వ్యవసాయ ఉత్పత్తులు పెరిగినప్పటికీ దీర్ఘకాలంలో భూసారం తగ్గిపోతుంది. భూసారం పెంచడానికి సేంద్రీయ ఎరు వులు వాడాలి. పంటలను క్రిమి కీటకాల నుంచి కాపాడటానికి ప్రమాదకరమైన క్రిమి సంహారక మందులను మాని ప్రకృతి సిద్ధ తైలాలు వాడాలి. ఇటీవల ప్రమాదకర క్రిమి సంహారక మందులు వినియోగంతో భూమి పైపొరల్లో జీవించే వానపాములు, పీతలు, నత్తలు, తాబేళ్లు, ఇతర జీవరాశులు పెద్ద సంఖ్యలో క్షీణించి పోయాయి. కొన్ని అయితే కనుమరుగయ్యాయి. దీంతో భూసారం గణనీయంగా తగ్గుతున్నది. దరిత్రిని కాపాడటానికి ప్రపంచ వ్యాప్తంగా మానవ కార్యాకలాపాలు మెరుగుపర్చడం ద్వారానే సాధ్యమవుతుందని పర్యావరణ వేత్తలు చెబుతున్నారు. అధికారంలో ఉన్న వారికి భూగ్రహంపై ప్రేమను చాటుకునేందుకు ఎర్త్‌డే ఒకటే అవకాశం.

ప్లాస్టిక్ వ్యర్థాలను తగ్గించాలి

మానవ జీవితంతో పెనవేసుకుపోయిన ప్లాస్టిక్‌ను నూరు శాతం నిషేదించడం కష్టమే . అయితే ప్లాస్టిక్ వ్యర్థాలు భూమిలో కలవకుండా రీసైక్లింగ్ యూనిట్లును నెలకొల్పాలి. కొంతమేర భూమిలో కలుస్తున్న ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించి కచ్చా రోడ్లు మెరుగుపరచడానికి వినియోగించాలి. ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే నష్టాలు గురించి ప్రజలకు వివరించాలి. ఇలాంటి చర్యలు చేపట్టడం ద్వారా ధరిత్రికి తద్వారా మానవాళికి మేలు జరుగుతుంది. పశ్చిమగోదావరి జిల్లాలో రొయ్య సాగు చేస్తున్న ప్పటికీ ఎప్పటికప్పుడు భూసారాన్ని పరీక్ష చేయాలి. సేంద్రీయ ఎరువులతో ఉద్యాన పంటలను ప్రోత్సహించాలి. హరిత వనాలు విరాజిల్లుతుంటేనే ప్రకృతి, పర్యావరణం సంరక్షించబడుతుంది. రైతులు వ్యవసాయ అధికారులు శాస్త్రవేత్తల సూచనలు మేరకే రసాయన ఎరువులు, క్రిమి సంహారక మందులు ఉపయోగించాలి. ఈచర్యలు చేపడితే భూతాపం నుంచి బయట పడటమే కాకుండా పర్యావరణానికి మేలు జరుగుతుంది.

తొలిసారిగా 1970 ఏప్రిల్ 22వ తేదీన ప్రపంచ ధరిత్రీ దినోత్సవం నిర్వహించారు. ప్రముఖ పర్యావరణ వేత్త గేలార్డ్ నెల్సన్, హార్వర్డ్ విశ్వ విద్యాలయంలో గ్రాడ్యుయేట్ విద్యార్థి డెనిస్ హేస్ కలిసి 1070లో దీనిని ప్రారంభించారు. 1990 నాటికి ఎర్త్‌డే నిర్వాహణ ప్రపంచవ్యాప్తం అయ్యింది. ఇప్పుడు ఏటా దాదాపు 200 దేశాలలో కోటి మందికి పైగా ఎర్త్‌డే కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. మానవ తప్పిదాలు కారణంగా ప్లాస్టిక్ వ్యర్థాలు నానాటికి పెరుతున్నాయి. అదేసమయంలో మొక్కలు నాటడం తగ్గి వృక్ష సంపద తగ్గుతుంది. 2040 నాటికల్లా ప్లాస్టిక్ కాలుష్యానికి ముగింపు పలకాలని 50 దేశాలు నడుం బిగించాయి. ఇదే సమయంలో ప్లాస్టిక్ వినియోగం సైతం 60 శాతానికి తగ్గించాలని అభివృద్ధి చెందిన దేశాలు నిర్ణయించాయి.

పర్యావరణాన్ని కాపాడుకోవాలి



పర్యావరణాన్ని కాపాడుకోవడం ప్రతీ ఒక్కరి బాధ్యత. నేడు గ్రామాల్లో సైతం చెట్లను విచక్షణా రహితంగా కొటివేస్తున్నారు. పొలాలను తీసేసి అపార్టు మెంట్‌లు కడుతున్నారు. దీనివల్ల భవిష్యత్‌లో తీవ్రమైన ఆక్సిజన్ కొరత ఏర్పడుతుంది. వచ్చేతరం ఆక్సిజన్ కొనుగోలు చేసి జీవించాల్సిన దుస్థితి వస్తుంది. భూమిలో ఉండే నీటిని చెట్లు, మొక్కలు పీల్చు కుంటాయి. వీటిని పూర్తిగా తొలగించడం వల్ల భూమిలో నీరు ఎటూ వెళ్లే మార్గం లేక భవిష్యత్‌లో వరదల తీవ్రత కూడా పెరిగే అవ కాశం ఉంది.

ఆరేపల్లి నాగ సుధీర్‌బాబు,బోటనీ అధ్యాపకుడు, డీఆర్‌జీ కళాశాల పెంటపాడు

ప్రకృతి వ్యవసాయం వైపు అడుగులు



ఎరువులు, పురుగు మందులు వాడకం వల్ల భూమి సారం కోల్పోతోంది. దీనికి ప్రభుత్వం ప్రకృతి వ్యవసాయంపై రైతులను మళ్లించేలా చేస్తుంది. దీంతో భూమిలో పోషక విలువలు పెరగడం ద్వారా రాబోయే తరాలకు సారవంత మైన నేలను అందించేందుకు వీలుంటుంది. నేడు అధిక దిగుబడుల కోసం రైతులు అధిక మొత్తంలో ఎరువులు, పురుగు మందులు వాడకం వల్ల భూమిలో పోషక విలువలు పోయి చౌడు నేలలుగా మారే ప్రమాదం ఉంది. ఎరువులు, పురుగుమందుల వాడకం తగ్గించడంపై దృష్టి సారించాలి.

ఆర్ఎస్ ప్రసాద్, మండల వ్యవసాయాధికారి, తాడేపల్లిగూడెం

చూచిరాతలు



ఏయూ దూరవిద్య సెమిస్టర్ పరీక్షల్లో మాస్ కాపీయింగ్ !?

సొమ్ములు చెల్లిస్తే ఇంటికే జవాబు పత్రాలట !

పరీక్షల్లో ప్రతిభకు పాతరేనంటూ అభ్యర్థుల ఆవేదన

యూనివర్సిటీ వీసీ దృష్టి సారిస్తేనే దిద్దుబాటు

ఏలూరు అర్బన్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : మరో ఏడాదికాలంలో శతవసంతాల చరిత్రను లిఖించనున్న ప్రతిష్టాత్మక ఆంధ్ర విశ్వ విద్యాలయంపై తాజాగా జరుగుతోన్న దూర విద్య డిగ్రీ, పీజీ మొదటి సెమిస్టర్ పరీక్షల్లో జరుగు తోన్న మూకుమ్మడి చూచిరాతల ఆరోపణలతో మచ్చపడనుందా ? యూనివర్సిటీ పరిధికి భౌతికంగా దూరంగా వున్న ఏలూరు జిల్లాలో సెమిస్టర్ పరీక్షలను కొన్ని కేంద్రాల్లో విద్యార్థులు అతి దగ్గరగా అంటే కనీసదూరం కూడా పాటించకుండానే పక్కపక్కనే కూర్చుని మాస్ కాపీయింగ్‌తో పరీక్షల్లో పారదర్శకతకు మంగళం పాడేస్తున్నారా ? ఆయా పరీక్ష కేంద్రాల నిర్వాహకుల సహకారం లేకుండానే ఈ తతంగం జరుగుతుండటం సాధ్యమేనా ? ప్రశ్నలకు జవాబుపత్రాల జిరాక్స్ కాపీలను చూస్తూ రాస్తుంటే నిరోధించాల్సిన యూనివర్సిటీ స్క్వాడ్ బృందాలు ఏం చేస్తున్నాయి ? ఈ వరుస ప్రశ్నలు, సందేహాలు, ఆరోపణలకు సోమవారం నుంచి ప్రారంభమైన ఆంధ్ర యూనివర్సిటీ డిస్టెన్స్ విభాగం యూజీ, పీజీ పరీక్షలు జరుగుతున్న తీరే నిదర్శనమని ప్రచారం జరుగుతోంది. వివరాల్లోకి వెళితే ఆంధ్ర విశ్వవిద్యాలయం బీఏ, బీకాం, బీఎస్సీ, ఎంఏ, ఎంకాం, ఎంఎస్సీ ప్రథమ సంవత్సరం మొదటి సెమిస్టర్ పరీక్షలు సోమవారం ప్రారంభం కాగా ఈ నెల 24వరకు జరుగనున్నాయి. ఉదయం 9 గంటలనుంచి 12 గంటలవరకు పీజీ, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు సెమిస్టర్ పరీక్షలు జరుగు తున్నాయి. జిల్లాలో 4 ప్రాంతాల్లో ఈ పరీక్షలకు కేంద్రాలు ఏర్పాటయ్యాయి. ఒక్కో కేంద్రంలో ఆయా కోర్సులకు 40నుంచి 100 మందివరకు పరీక్షార్థులుంటారు. ఒక్కో పేపరు 70 మార్కు లకు పరీక్ష ఉంటుంది. జిల్లా వ్యాప్తంగా దూర విద్య విధానంలో డిగ్రీ, పీజీ కోర్సులకు అడ్మిషన్ పొందిన విద్యార్థులు ఈ కేంద్రాల్లో పరీక్షలు రాయాల్సి ఉంటుంది. వీటిలో కొన్ని కేంద్రాల్లో సెమిస్టర్ పరీక్షలు జరుగుతున్న తీరుపై తీవ్ర ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పరీక్ష సమయం మొదలుకుని అభ్యర్థుల సిట్టింగ్, బుక్‌లెట్ల అందజేత, జవాబుపత్రాల జిరాక్స్ కాపీల పంపిణీ..ఇలా అన్ని సందర్భాల్లో అవకతవకల మయంగా తయారైందని సమాచారం.

ఒక్కో పేపరుకు రూ.2500 చెల్లించినవారికే..

యూనివర్సిటీకి నిర్ణీత ఫీజులుచెల్లించి పరీక్షలకు హాజరైన ఆయా ప్రాంతాల పరీక్షార్థులకు సెమిస్టర్ పరీక్షలు జరుగుతోన్న కొన్ని కేంద్రాల నిర్వాహకులు చుక్కలు చూపిస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి. ఆ ప్రకారం ఒక్కో పేపరుకు రూ.2500 'చూచిరాతల ఫీజు' గా చెల్లించినవారికి పరీక్ష రాసేందుకు తొలి ప్రాధాన్యత, కేంద్రంలోకి ప్రవేశం కల్పిస్తున్నట్టు ప్రచారం జరుగుతోంది. ఇలా డిమాండ్ చేసిన ఫీజుచెల్లించకపోతే పరీక్షగదిలోకి ప్రవేశం లేదు సరికదా, గదుల్లో బల్లలపై అభ్యర్థులకు యూనివర్సిటీ కేటాయించిన నంబర్లుకూడా కనబడకుండా అయోమయం సృష్టిస్తున్నారని కొందరు వాపోతున్నారు. పరీక్ష ప్రారంభ సమయమైనా గదుల్లోకి వెళ్లనీయకుండా ఆరుబయటే నిలబెడుతున్నారని, ఆ మాత్రం డబ్బులు ఇవ్వలేనివారు పరీక్షకు ఎందుకు హాజరవుతున్నారని కొందరు నిర్వాహకులు నిలదీస్తుండగా, మరికొందరైతే దూరవిద్య పరీక్షల 'కల్చర్'ను పాడు చేయవద్దని పరీక్షలు జరిగేతీరుపై హితబోధ చేస్తున్నారని సమాచారం. డబ్బులు ఇవ్వని అభ్యర్థులకు బుక్‌లెట్లు పరీక్షసమయం ముగిసే సమయానికి గంటలోపు ఇవ్వడం, కేంద్రంలో బహుళ అంతస్తుల్లోని గదులకు తిప్పించడం వంటి విపరీత పోకడలకు ఒడిగడుతున్నారని తెలుస్తోంది. ఇంకొందరైతే జవాబులను రాసే బుక్‌లెట్లను అభ్యర్థుల ఇంటికే ముందుగా తీసుకెళ్లి, ఎంచక్కా తీరిగ్గా జవాబులను ఇంటివద్ద రాసుకుని పరీక్ష ముగిసిన తర్వాత ఎవరూ చూడకుండా వాటిని ఆయా కేంద్రాల్లో తిరిగి అందజేయడం ద్వారా బండిళ్లలో కలిపి 'పాస్ గ్యారెంటీ' స్కీంను అదనపు చెల్లింపులపై అమలు చేస్తున్నారని ప్రచారం జరుగుతోంది. డబ్బులు ఇచ్చిన విద్యార్థులను గుర్తించేందుకు వీలుగా హాల్‌టిక్కెట్ల వెనుకభాగంలో ముద్రలు వేస్తున్నట్టు సమాచారం.

సిట్టింగ్ స్క్వాడ్‌లతో నిరంతర నిఘా ఉంటేనే..

దూరవిద్య పరీక్షలనగానే డబ్బులిచ్చిన వారికి దొడ్డిదోవలో పరీక్షల్లో సులువుగా ఉత్తీర్ణత సాదించవచ్చునన్న అపవాదు ఉంది. తాజాగా జరుగుతున్న ఆంధ్ర విశ్వవిద్యాలయం దూరవిద్య యూజీ, పీజీ సెమిస్టర్ పరీక్షల్లోనూ అదే తంతు జరుగుతోంది. పరీక్షల్లో అవకతవకలు జరుగ కుండా నిరోధించేందుకు స్క్వాడ్ బృందాలను యూనివర్సిటీ నియమించడం పరిపాటి. దీనికిభిన్నంగా కొంతకాలంగా స్క్వాడ్ బృందాల జాడ పరీక్షల్లో కనబడటం లేదని పలువురు వాపోతున్నారు. కొన్నిచోట్ల సీసీ కెమెరాలు వున్నా వాటికి గంతలు కట్టేయడమో లేదా మూకుమ్మడి చూచిరాతల దృశ్యాలు కనబడకుండా కెమెరాల డైరెక్షన్‌ను మార్చేయడమో జరుగుతోందని తెలుస్తోంది. దూరవిద్య పరీక్షల్లో అడ్డగోలు విధానాలు బహిర్గతమవుతున్నా వాటిని యూనివర్సిటీ ఉప కులపతి దృష్టిలో పడకుండా విశ్వ విద్యాలయ వర్గాలే అడ్డుకుంటున్నాయన్న ఆరోపణలు సైతం ఉన్నాయి. తాజాగా జరుగుతున్న దూరవిద్య సెమిస్టర్ పరీక్షల్లో కొన్ని సెంటర్ల అక్రమాలను నిరోధించేందుకు యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ నేరుగా రంగంలోకి దిగితే తప్ప ఇతరులెవరికీ సాధ్యమయ్యే పనికాదని చెబుతున్నారు.



కూల్.. కూల్.. తాటి ముంజులు

వేసవి తాపం తగ్గించే ఔషధం

పాలకొల్లు అర్బన్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): వేసవి వచ్చిందంటే ఎండ తీవ్రత తట్టుకునేందుకు ప్రకృతి ప్రసాదించిన వాటిలో తాటి ముంజలు ఒకటి. తాటి ముంజలు ఔషధ గుణాలు కలిగి ఉంటాయి. వీటిలో ఎ, బి, సి విటమిన్లు, ఐరన్, జింక్, ఫాస్పరస్, పోటాషియం ఉంటాయి. గుండె ఆరోగ్యానికి మంచిది .. మలబద్ధకం నివారిస్తుందని ఆయుర్వేద వైద్యులు చెబుతున్నారు. అధికంగా నీరు ఉండటం వల్ల శరీర బరువును తగ్గిస్తుంది. చికెన్ ఫాక్స్ (పొంగు) వంటి సీజనల్ వ్యాధులకు గురై బాధపడే వారికి ఉపశమనం కలిగిస్తుంది ... చెడు కోలెస్ట్రాల్ తగ్గిస్తుంది. ఆకలిని అరి కడుతుంది. ఎండ వేడిమి వల్ల తలిగే తాపాన్ని నివారిస్తుంది. తాటి ముంజులు చౌకగా లభించడంతో సామాన్యులకు అందుబాటులో ఉంటాయి. పాలకొల్లు బస్టాండ్ రోడ్డులో తంగెళ్ళ రమేష్ తమ గ్రామం నుంచి రోజూ ముంజకాయలు తీసుకువచ్చి విక్రయిస్తున్నాడు. డజను రూ. 60లకు విక్రయిస్తున్నట్టు తెలిపాడు. రోజుకురూ. 1500 వరకూ ఆదాయం వస్తోందని, మున్సిపల్ పన్ను రూ.100 , ఖర్చులు పోను రూ800 వరకు మిగులు తోందని చెప్పాడు. వేసవి సీజన్ అయిన తరువాత కొబ్బరి దింపు, కాయలు వలుపు చేస్తొంటానని చెబుతున్నాడు.



పాలకొల్లు బస్టాండ్ సమీపంలో విక్రయాలు



మంత్రి నాదెండ్లకు స్వాగతం పలుకుతున్న నాయకులు

నియోజకవర్గాల్లో ఇసుక స్టాక్ పాయింట్లు

కాల్వలకు ఈ నెల 25 వరకు నీటి సరఫరా

ఉపాధి పనిదినాలు మరింత పెంచాలి

జిల్లా అధికారుల సమావేశంలో ఇన్‌చార్జి మంత్రి నాదెండ్ల మనోహర్

ఏలూరు, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని నియోజకవర్గాల్లో ఇసుక స్టాక్ పాయింట్లు అందుబాటులో ఉండేలా చూడాలని, వేసవి, వర్షాకాలం అవసరాలకు ఇసుకను సిద్ధం చేసుకోవాలని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి నాదెండ్ల మనోహర్ అధికారులను ఆదేశించారు. ప్రతీ స్టాక్ పాయింట్ల వద్ద లక్షల మెట్రిక్ టన్నుల నిల్వలు ఉంచాలని సూచించారు. ఏలూరు కలెక్టరేట్‌లో మంత్రి కొలుసు పార్థసారధి, జిల్లా కలెక్టర్, ఎమ్మెల్సీలతో పలు అభివృద్ధి అంశాలపై సోమవారం రాత్రి నాదెండ్ల మనోహర్ సమీక్షించారు. ప్రస్తుత వేసవిలో నిర్మాణ పనులకు అనుకూలమని, జిల్లాలో పేదల ఇళ్లకు ఉచిత ఇసుకను అందుబాటులో ఉంచాలన్నారు. వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా అన్ని ముందస్తు చర్యలు తీసుకోవాలని, మరమతులు అవసరమైన చోట్ల బోర్లు వేసి సమస్య లేకుండా చూడాలన్నారు. తాగునీటి చెరువులకు పూర్తి స్థాయిలో నీరు నింపుకునేందుకు ఈ నెల 25వ తేదీవరకు కాల్వలు నీటి విడుదల చేస్తామని, ఆ తర్వాత కట్టేస్తారని మంత్రి చెప్పారు. జాతీయ ఉపాధి హామీ పథకంలో కోటి 20 లక్షలు పనిదినాలు లక్ష్యంగా కాగా ఇంతవరకు కోటి 60 లక్షల పనిదినాలు కల్పించామన్నారు. ఉపాధిహామీ పథకంలో కూలీలకు వేతనాలను వారంలోగా అందేలా చూడాలని కోరారు. జిల్లాలో ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. మంత్రి కొలుసు పార్థసారధి మాట్లాడుతూ పేదల ఇళ్ల నిర్మాణాలు, వ్యక్తిగత నిర్మాణాలు పునాదులు పూడిక అవసరాలను మట్టిని తీసుకునేందుకు అనుమతించాలన్నారు. జాతీయ ఉపాధిలో మామిడి రైతులకు మేలు చేకూర్చే కార్యక్రమాలు చేపట్టాలన్నారు. పోలవరం కుడి కాల్వ ప్రధాన కాలువ ద్వారా మీర్జాపుం, సగ్గూరు, కొమ్మూరు రిజర్వాయర్లకు ఎత్తిపోతల పథకం కింద సాగునీరు అందించాలన్నారు. ఉపాధి హామీ పథకంలో మంజూరైన మైనర్ ఇరిగేషన్ చెరువు పనులకు త్వరిత గతిన చేపట్టాలన్నారు. కైకలూరు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ మాట్లాడుతూ తమ నియోజకవర్గంలో శివారు ప్రాంతాల్లో తాగునీటి సమస్యను పరిష్కరించాలన్నారు. ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ మాట్లాడుతూ 2019లో గ్రామంలో నిర్మించిన గ్రామసమాఖ్య భవనాల నిర్మాణాలకు బిల్లుల చెల్లింపు జరిపేలా చూడాలన్నారు. బడేటి చంటి మాట్లాడుతూ పేదల ఇళ్లకు పునాదుల పూడిక అవసరాలకు మట్టిని తీసుకునేందుకు అనుమతులు ఇవ్వాలన్నారు. ఎమ్మెల్సీ పేరా బత్తుల రాజశేఖరం, ఎమ్మెల్యే వత్సవాయి ధర్మరాజు, జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి, జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి, డీఆర్వో విశ్వేశ్వరరావు, ఆర్డీవో అచ్యుత్ అంబరీష్ పాల్గొన్నారు.

ఐక్యంగా పనిచేయండి

కూటమిలో విబేధాలు లేకుండా ఐకమత్యంతో కలిసి పనిచేయాలని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి నాదెండ్ల మనోహర్ సూచించారు. మూడు రోజుల జిల్లా పర్యటనకు సోమవారం ఏలూరు గిరిజన భవన్‌లో ఆయనకు నాయకులు, ఎమ్మెల్యే స్వాగతం పలికారు. అక్కడే జిల్లాలోని నాయకులు, ఎమ్మెల్యేలతో నాదెండ్ల సమావేశం అయ్యారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను కింద స్థాయికి చేరువగా తీసుకెళ్లడంలో అందరూ సమిష్టిగా కలిసి పని చేయాలన్నారు. ప్రభుత్వానికి చేటు లేకుండా ఐక్యంగా ప్రజలకు చేరువకావాలన్నదే సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌లు ముఖ్య ఉద్దేశ్యమన్నారు. ఏవైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని నాదెండ్ల కోరారు.

మానవత్వం చాటిన మంత్రి

జిల్లా పర్యటనలో భాగంగా విజయవాడ నుంచి వస్తున్న మంత్రి నాదెండ్ల మనోహర్ మానవత్వం చాటుకున్నారు.ఏలూరు సమీపంలో రెండు బైకులు ఢీకొన్న ఘటనలో గాయపడిన ఇద్దరు యువకులను చూసి వెంటనే తన వాహనాన్ని ఆపి గాయపడిన వారికి ప్రథమ చికిత్స అందజేశారు. అంబులెన్స్ ఏర్పాటు చేయించి వారిని ప్రభుత్వాసుపత్రికి చేర్చారు. సంబంధిత ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్‌కి ఫోన్ చేసి మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు.

బదిలీ టీచర్లకు మెడికల్ చెకప్ క్యాంపు తేదీలు ఖరారు

ఏకకాలంలో సదరం క్యాంపుతో రద్దీ సమస్యలకు ఆస్కారం ?

ఏలూరు అర్బన్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయుల సాధారణ బదిలీల ప్రక్రియలోభాగంగా ప్రిఫరెన్షియల్ కేటగిరీ/స్పెషల్ పాయింట్లను పొందేందుకు ఉమ్మడి జిల్లాలోని సంబంధిత కేటగిరీల హెచ్‌ఎంలు, టీచర్లకు మెడికల్ చెకప్ క్యాంపును ఈ నెల 24 నుంచి 26 వరకు ఏలూరు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో నిర్వహిస్తున్నట్లు డీఈవో వెంకటలక్ష్మమ్మ తెలిపారు. ఉపాధ్యాయులు తమ పాత ఆరోగ్య సర్టిఫికెట్లను చూపించి, సంబంధిత వైద్య నిపుణులతో పరిశీలన చేయించుకుని కొత్తగా మెడికల్ సర్టిఫికెట్‌ను తప్పనిసరిగా పొందాలని సూచించారు.

అవే తేదీల్లో సదరం మెడికల్ క్యాంపు

ఉమ్మడి జిల్లాలో ప్రిఫరెన్షియల్ కేటగిరీ /స్పెషల్ పాయింట్లతో కూడిన మెడికల్ సర్టిఫికెట్లు వున్న సుమారు 400 మంది హెచ్‌ఎంలు, టీచర్ల జాబితాలను ప్రభుత్వాసుపత్రి వైద్య వర్గాలకు జిల్లా విద్యాశాఖ ఇప్పటికే అందజేసింది. దీనికనుగుణంగా వైద్యనిపుణులు సమగ్ర పరిశీలన చేసి కొత్తగా మెడికల్ సర్టిఫికెట్లను ఇవ్వాల్సి ఉంది. వైద్యుల పరిశీలనలో ఏవైనా అభ్యంతరాలను లేవనెత్తితే వారిని రాష్ట్ర ఆసుపత్రి (హైయర్ సెంటర్) వైద్యనిపుణుల బృందం పరిశీలనకు పంపించే అవకాశం ఉన్నట్టు సమాచారం. మరోవైపు ఉపాధ్యాయులకు నిర్వహించనున్న మెడికల్ చెకప్ క్యాంపు తేదీల్లోనే దివ్యాంగులకు జారీచేసే సదరం సర్టిఫికెట్ల మెడికల్ క్యాంపును కూడా నిర్వహించనుండటం.. ఆసుపత్రిలో ఇప్పటికే వైద్యుల కొరతతో ఎదురవుతున్న సమస్యలు ఆయా రోజుల్లో మరింత జటిలమయ్యే పరిస్థితులు కనబడుతున్నాయి. సంబంధిత తేదీల్లో రోజువారీ వైద్యసేవల కోసం ఆసుపత్రికి విచ్చేసే ఓపీ విభాగం రోగులకు సైతం ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం లేకపోలేదని భావిస్తున్నారు.

పశ్చిమ, ఏలూరులకు డీఎల్‌డీవోలు

ఏలూరు, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : పంచాయతీరాజ్ వ్యవస్థల్లో సంస్కరణల్లో భాగంగా పశ్చిమ, ఏలూరు జిల్లాలకు ఇద్దరు ఎంపీడీవోలను డీఎల్‌డీవోలుగా పదోన్నతి కల్పించి పోస్టింగ్‌లను ఇస్తూ ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ శశిభూషణ్ కుమార్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. నర్సాపురం డీఎల్‌డీవోగా జి.రాణి, ఏలూరు జిల్లా విజిలెన్స్ ఆఫీసర్‌గా ఎన్.భోజిలను నియమించారు.

1035..డీఎస్సీ పోస్టులు

ఉపాధ్యాయ నియామకాలు ఇలా

ఏలూరు అర్బన్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : మెగా డీఎస్సీ రిక్రూట్‌మెంట్‌లో భాగంగా ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో ప్రభుత్వ/స్థానిక సంస్థల పాఠశాలల్లో 837 టీచరు పోస్టులు, మున్సిపల్ యాజమాన్యంలో 153, మున్సిపల్ కార్పొరేషన్ యాజమాన్యం పాఠశాలల్లో 45 పోస్టులను కలిపి మొత్తం 1035 ఉద్యోగాలను భర్తీ చేయనున్నట్టు డీఈవో వెంకటలక్ష్మమ్మ తెలిపారు. అభ్యర్థులు మే 15 లోగా ఆన్‌లైన్ విధానంలో దరఖాస్తు చేసుకోవాలని, జూన్ 6 నుంచి జూలై 6 వరకు సీబీటీ విధానంలో పరీక్షలు జరుగు తాయన్నారు. డీఎస్సీకి సంబంధించిన జీవోలు, పోస్టుల వివరాలు, పరీక్ష షెడ్యూలు, సిలబస్, నోటిఫికేషన్, హెల్ప్‌డెస్క్ వివరాలను విద్యాశాఖ వెబ్‌సైట్ cse.ap.gov.inలో అందుబాటులో ఉంచామన్నారు.

స్కూల్ అసిస్టెంట్

సబ్జెక్టు	ప్రభుత్వ/ స్థానిక సంస్థలు	మున్సిపల్	మున్సిపల్ కార్పొరేషన్	మొత్తం
తెలుగు	35	3	2	40
హిందీ	58	2	1	61
ఇంగ్లీషు	79	4	1	79
గణితం	37	2	1	40
ఫిజికల్ సైన్సు	38	2	0	40
బయోలాజికల్ సైన్సు	58	5	1	64
సోషల్‌స్టడీస్	91	9	3	103
ఫిజికల్ ఎడ్యుకేషన్	179	2	0	181
సంస్కృతం	2	0	0	2
ఎస్జీటీ				
తెలుగు మీడియం	260	121	36	417
ఉర్దూ మీడియం	0	3	0	3
మొత్తం	**837**	**153**	**45**	**1035**

అభ్యర్థుల్లో ఆనందం

మెగా డీఎస్సీపై నిరుద్యోగ అభ్యర్థుల్లో ఆనందం వ్యక్తం అవుతోంది. ఎంతోకాలం నుంచి ఎదురు చూస్తున్నామని ఇప్పటికి తమ కల నెరవేర్చుకునే అవకాశం వచ్చిందని హర్షం వ్యక్తం చేస్తున్నారు..

నిరుద్యోగులకు అవకాశం



గత ప్రభుత్వంలో ఎక్కడా కూడా డీఎస్సీ నిర్వహించలేదు. ఎంతోమంది నాలాంటి నిరుద్యోగులకు కూటమి ప్రభుత్వం డీఎస్సీ రూపంలో అవకాశం కల్పించింది. మంత్రి నిమ్మల రామానాయుడు ఏర్పాటు చేసిన ఉచిత కోచింగ్‌లో శిక్షణ పొందుతున్నాను.

గుడాల జ్యోతి, సగం చెరువు, పోడూరు మండలం

ఎప్పటి నుంచో ఎదురు చూస్తున్నాం



ప్రభుత్వం మెగా డీఎస్సీ షెడ్యూలు విడుదల చేయడం చాలా ఆనందంగా ఉంది. నేను బీఎస్సీ బీఈడీ చేశాను. ఇటీవల జరిగిన టెట్ ఎగ్జామ్ రాసి క్వాలిఫై అయ్యాను. ప్రస్తుతం డీఎస్సీ పరీక్షలకు ప్రిపేర్ అవుతున్నాను. మొదటిసారి ఈ పరీక్షకు ప్రిపేర్ అవుతున్నాను. ఎప్పటి నుంచో డీఎస్సీ కోసం ఎదురు చూస్తున్నాం.

బర్రే ప్రియాంక, ఆచంట

నిరుద్యోగుల జీవితాల్లో వెలుగు



డీఎస్సీ కోసం కళ్ళు కాయలు కాసేలా ఎదురు చూస్తున్నాం. డీఎస్సీ ద్వారా ఉద్యోగాలు కల్పించిన మహానుభావుడు చంద్రబాబు. గత ప్రభుత్వ తీరుతో విసిగిపోయి నిరాశ చెందాం. ప్రభుత్వం మాట నిలబెట్టుకుంది.

జ్యోతి, సిద్ధాపురం, ఆకివీడు మండలం

మాట నిలబెట్టుకున్న ప్రభుత్వం



కూటమి ప్రభుత్వం ఇచ్చిన మాట నిలబెట్టుకుంది. 2008 తరువాత మెగా డిఎస్సీ విడుదల కాలేదు.ఎంతో ఆశగా ఎదురు చూస్తున్నాము. ఈసారి తప్పని సరిగా ఉద్యోగం సంపాదించాలనే పట్టుదలతో ఉన్నాను. డీఎస్సీ పరీక్షకు కాస్త సమయం ఇస్తే బావుంటుంది.

బండి ప్రశాంతి, జంగారెడ్డిగూడెం

(పాలకొల్లు రూరల్/ ఆచంట/ కాళ్ళ/జంగారెడ్డిగూడెం)

ఉలికి పాటు



రూ.500 నకిలీ నోట్లు చెలామణి

కేంద్ర హోంశాఖ హెచ్చరికతో జిల్లా వ్యాపారుల్లో ఆందోళన

నరసాపురం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): దేశంలో రూ.500 నకిలీ నోట్లు చెలామణి అవుతున్నాయంటూ కేంద్ర హోంశాఖ సోమవారం చేసిన ప్రకటన జిల్లావాసుల్ని ఉలికి పాటుకు గురిచేసింది. తొమ్మిదేళ్ల నుంచి ప్రజలు స్వేచ్ఛగా నోట్లు చెలామణి చేస్తున్నారు. అడపదడపా దొంగనోట్లు చెలామణిలోకి వచ్చినా వాటి ఇట్టే పట్టేసేవారు. అయితే అసలు నోటుకు దీటుగా నకిలీ నోట్లు ఉన్నాయంటూ కేంద్రం ప్రకటనతో వ్యాపారులంతా అప్రమత్తమయ్యారు. నోట్లను క్షుణ్ణంగా పరిశీలించిన తరువాతే కస్టమర్ల నుంచి తీసుకుంటున్నారు. నిఘా విభాగాలు రంగంలోకి దిగాయి. ఈనోట్లు ఎక్కడ నుంచి వచ్చాయన్న దానిపై ఆరా తీస్తున్నాయి. 2016లో కేంద్రం రూ.1000, రూ.500 నోట్లను రద్దు చేసింది. మళ్లీ రూ.1000 నోటును విడుదల చేయలేదు. ప్రస్తుతం దేశంలో రూ 500 పెద్ద నోటు.ఈ నోటు తయారీలో కేంద్రం చాలా జాగ్రత్తలు పాటించింది. ఈ కారణంగా దొంగ నోట్ల చెలామణి తగ్గింది.గతంలో నరసాపురం, టీపీగూడెం, జంగారెడ్డిగూడెం ప్రాంతాల్లో దొంగ నోట్ల ముఠాను పట్టుకున్నారు. నోట్ల రద్దుకు ముందు జిల్లాలో దొంగ నోట్ల చెలామణి ఎక్కువగా జరిగేది. బంగ్లాదేశ్ నుంచి కోల్‌కతా మీదుగా జిల్లాలోకి నోట్లు సరఫరా జరిగేది. అసలకు దీటుగా ఈ నోటు ఉండటంతో చాలామంది వీటిని సులభంగా మార్చి కోట్లకు పడగలెత్తారు. ప్రస్తుతం చెలా మణిలో ఉన్న నోటులో ఒక లోపాన్ని ఆర్‌బీఐ గుర్తించింది. అసలు నోటులో రిజ్వర్‌బ్యాంకు అనే ఇంగ్లీషు పదంలో ఆర్ పక్కన ఉండాల్సిన ఈకి బదులు ఏ ఉందని గుర్తించింది. ప్రజలు వీటిని గమనించాలని సూచించింది.



నేత్రపర్వం..ధ్వజారోహణం

ద్వారకాతిరుమల, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): శ్రీవారి క్షేత్రానికి దత్తత దేవాలయమైన లక్ష్మీపురం ఆలయంలో శ్రీనివాసునికి జరుగుతున్న దివ్యకల్యాణ మహోత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి జరిగిన ధ్వజారోహణ భక్తులకు నేత్రపర్వమైంది. సాయంత్రం ఆలయ యాగశాలలో అర్చకులు, పండితులు అంకురార్పణ, వాస్తుహోమాలను నిర్వహించారు. ఆతరువాత ధ్వజపటంపై గరుత్మంతుని చిత్రపటం వేసి గరుడ ప్రతిష్ట జరిపారు. మేళ తాళాలు, మంగళవాయిద్యాలు, పండితుల మంత్రోచ్ఛరణల నడుమ సర్వాది దేవతలను ఆహ్వానిస్తూ ధ్వజస్తంభం వద్ద ఎగురవేశారు.



క్యూఆర్ కోడ్ గురించి వివరిస్తున్న జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి

క్యూఆర్ కోడ్ ఫిర్యాదుల విభాగం ప్రారంభం

భీమవరం క్రైం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన క్యూఆర్ కోడ్ ఫిర్యాదుల విభాగాన్ని పశ్చిమగోదావరి జిల్లాలో మొట్ట మొదటిసారిగా భీమవరం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో సోమవారం ఎస్పీ అద్నాన్ నయీం అస్మి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్యూఆర్ కోడ్ వల్ల ఎన్నో లాభాలు ఉన్నాయన్నారు. డ్రగ్స్, గంజాయి, మహిళలపై దాడులు, ర్యాగింగ్, పలు వాటిపై ఎవరైనా పోలీసులకు ఫిర్యాదు చేయాలంటే క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి ఫిర్యాదు చేయొచ్చని అన్నారు. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయగానే కొన్ని ప్రశ్నలు వస్తాయని, ఆ ప్రశ్నలకు జవాబు ఇస్తే నేరుగా ముఖ్యమంత్రి కార్యాలయానికి ఫిర్యాదు అందుతుందన్నారు. ఫిర్యాదు చేసిన వారి వివరాలు గోప్యంగా ఉంచడం జరుగుతుందని తెలిపారు. ముఖ్యమంత్రి కార్యాలయానికి ఫిర్యాదు అందగానే సంబంధిత జిల్లా ఎస్పీకి ఫిర్యాదు వివరాలు రావడం జరుగుతుందని, వెంటనే సంబంధిత స్టేషన్‌కు వివరాలను పంపించి నేరాలను అరికట్టడం జరుగుతుందన్నారు. ఇదంతా ఆర్‌టీజీఎస్ సిస్టమ్ ద్వారా వివరాలు నమోదు అవుతాయని తెలిపారు. జిల్లాలో ఉన్న 25 స్టేషన్లలో ఈ క్యూఆర్ కోడ్ సోమవారం నుంచి అందుబాటులో ఉంచడం జరిగిందన్నారు. కార్యక్రమంలో భీమవరం డీఎస్పీ ఆర్‌జి. జయసూర్య, టూటౌన్ సీఐ కాళీచరణ్, వన్‌టౌన్ సీఐ నాగరాజు, ట్రాఫిక్ సీఐ శ్రీనివాస్, రూరల్ సీఐ శ్రీనివాసరావు, కాళ్ళ ఎస్ఐ ఎస్.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

చేపల మేత దొంగల అరెస్టు

ఉంగుటూరు, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): ఉంగుటూరు మండలం రాచూరు, చుట్టుపక్కల గ్రామాల చేపల చెరువుల వద్ద నిల్వ ఉంచిన మేత బస్తాలను దొంగిలించిన ఆరుగురిని అరెస్టు చేసినట్లు చేబ్రోలు ఎస్ఐ ఎం.సూర్య భగవాన్ తెలిపారు. వీరిని అరెస్టు చేసి సోమవారం నాడు తాడేపల్లిగూడెం కోర్టులో హాజరు పరచగా 14 రోజుల రిమాండ్ విధించారు. రైతు నడింపల్లి రామాంజనేయ వర్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు జరిపి సీతారాంపురానికి చెందిన బైరపూడి హరికృష్ణ, వనపర్తి సహదేవుడు, తాడేపల్లి వెంకట కుమార్, జుత్తుక ధనుష్, జుత్తుగ పవన్ కుమార్, నగివేరి జయరాజులను అరెస్టు చేసినట్లు తెలిపారు. దాదాపు ఏడాదిగా వీరు మేతబస్తాల చోరీలకు పాల్పడుతున్నట్టు తెలిపారు.

జాతీయ రహదారిపై రెండు మోటారు సైకిళ్లు ఢీ



క్షతగాత్రులు తండ్రికుమార్తె క్రీస్తురాజు, సింధు

- తండ్రి, కుమార్తెకు తీవ్ర గాయాలు
- రెండు కాళ్లు విరిగిపోయిన తండ్రి..తన కుమార్తెను కాపాడాలంటూ దండాలు
- కాల్ చేసినా కానరాని 108 అంబులెన్సు
- మోటారు సైకిల్‌పై కుమార్తెను ఆసుపత్రికి తీసుకువెళ్లిన కూలీలు
- ప్రమాద సమాచారం అందుకున్న ఎమ్మెల్యే చింతమనేని - ప్రైవేటు అంబులెన్సు ఏర్పాటు

ఏలూరు క్రైం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : రెండు మోటారు సైకిళ్లు ఢీకొనడంతో తండ్రి, కుమార్తె ప్రాణాపాయ పరిస్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. దెందులూరుకు చెందిన నేరెళ్ళ క్రీస్తురాజు తన కుమార్తె సింధు (14) వట్లూరు గురుకుల పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నది. సోమవారం సాయంత్రం ఇంటి నుంచి కుమార్తెను గురుకుల పాఠశాలకు క్రీస్తురాజు తన మోటారు సైకిల్‌పై తీసుకువెళ్తుండగా 16వ నంబరు జాతీయ రహదారి మార్గమధ్యలో వంగూరు బ్రిడ్జి వద్ద మరో మోటారు సైకిల్ ఢీ కొంది. ఈ ప్రమాదంలో క్రీస్తురాజు రెండు కాళ్ళు విరిగిపోయి ఎముకలు బయటకు వచ్చాయి. సింధు తలకు బలమైన గాయం తగిలి అపస్మారక స్థితిలోకి వెళ్ళి పోయింది. కాళ్ళు విరిగిపోయిన తండ్రి తమ బిడ్డను కాపాడండంటూ అటుగా వెళ్తున్న వారిని దండం పెడుతూ ప్రాధేయపడ్డాడు. చూసిన వారు వెంటనే 108 అంబులెన్సుకు సమాచారం ఇచ్చారు. అంబులెన్సు ఎంతసేపటికి రాకపోవడంతో ఏలూరునకు చెందిన చంద్రగిరి అంకయ్య, ఎస్.రమణలు కూలిపనులకు వెళ్ళి తిరిగి ఏలూరు వస్తూ ప్రమాద పరిస్థితిని చూసి ప్రాణాపాయస్థితిలో ఉన్న సింధును మోటారు సైకిల్‌పై ఎక్కించుకుని దుగ్గిరాల బ్రిడ్జి వరకూ వచ్చారు. అక్కడ ఆటో కనిపించడంతో వెంటనే ఆటో ఎక్కించి ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తీసుకు వచ్చారు. ప్రమాద సంఘటనలో రెండు కాళ్ళు విరిగి పోయి ఆర్తనాదాలతో కొట్టు మిట్టాడుతున్నాడని, అతను దెందులూరుకు చెందిన వాడని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌కు సమాచారం అందింది. తను మంత్రి పర్యటనలో ఉన్నప్పటికీ వెంటనే తన అనుచరులను పంపించి ప్రైవేటు అంబులెన్సులో క్షతగాత్రును ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

108 పై ప్రజల ఆగ్రహం

రోడ్డు ప్రమాదంపై 108 అంబులెన్సుకు సమాచారం ఇచ్చి 40 నిముషాలు అయినా వాహనం రాకపోవడంతో స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై ఉన్నతాధికారులు విచారణ జరపాలని డిమాండ్ చేశారు.

రైలు ఢీకొని వృద్ధురాలి మృతి

ఏలూరు క్రైం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : ఏలూరు పోస్టల్‌కాలనీకి చెందిన వాకా మీనా కుమారి (62) సోమవారం పోస్టల్ కాలనీ సమీపంలో రైలు పట్టాలుదాటుతుండగా ప్రమాదవశాత్తు రైలు ఢీకొనడంతో తీవ్ర గాయాలకు గురైంది. 108 అంబులెన్సులో ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ కొద్ది సేపటికే మృతి చెందింది. ఆసుపత్రి వైద్యులు ఎమ్మెల్సీగా నమోదు చేసి ఆసుపత్రి ఔట్‌పోస్టు పోలీసులకు సమాచారం ఇచ్చారు. రైల్వే ఎస్ఐ సైమన్ కేసు నమోదు చేశారు.

లాడ్జిపై దాడి

భీమవరం క్రైం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): భీమవరం రెండవ పట్టణంలో శ్రీనిధి లాడ్జిపై టూటౌన్ సీఐ కాళీచరణ్ సిబ్బందితో సోమవారం దాడి చేశారు. లాడ్జిలో 9 మంది యువకులు, 9 మంది యువతులను అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. వారి తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చి స్టేషన్‌కు రప్పిస్తున్నట్లుగా తెలిసింది. లాడ్జి యజమానిపై కేసు నమోదు చేస్తున్నారు. పట్టుబడిన యువకులు, యువతులు విద్యార్థులుగా సమాచారం.

పార్కు చేసిన మోటార్ సైకిళ్లే టార్గెట్

ముగ్గురు అంతర్ రాష్ట్ర దొంగల అరెస్టు.. రూ.13.40 లక్షల విలువైన మోటారు బైక్‌ల స్వాధీనం



నిందితులను అరెస్టు చేసి వివరాలు చెబుతున్న డీఎస్పీ విశ్వనాథ్

తణుకు రూరల్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): రాత్రి సమయాల్లో ఇంటి ముందు పార్కు చేసిన మోటారు సైకిళ్లను దొంగిలించుకుపోతున్న ముగ్గురు సభ్యుల అంతరాష్ట్ర దొంగల ముఠాను అరెస్ట్ చేశారు. తెలంగాణ రాష్ట్ర జీడిమెట్ల, సూరారం, కూకట్‌పల్లి, పోలీస్ స్టేషన్‌లతో పాటు తణుకు రూరల్ పోలీస్ స్టేషన్, పోడూరు, నిడదవోలు పోలీస్ స్టేషన్‌ల పరిధిలో జరిగిన బైక్ చోరీల్లో మొత్తం 11 వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈమేరకు సోమవారం తాడేపల్లిగూడెం డీఎస్పీ డి.విశ్వనాథ్, తణుకు రూరల్ సీఐ బి.కృష్ణ కుమార్‌లు తణుకు రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఈ మోటారు సైకిళ్లను దొంగిస్తున్న ముఠా వివరాలను వెల్లడించారు. జీడిమెట్లకు చెందిన దాసరి మణిబాబు, తణుకు పాతూరుకు చెందిన గుడాల లక్ష్మీనారాయణ, తణుకు రూరల్ మండలం కొమరవరం గ్రామానికి చెందిన బొంత రవితేజ ఒక ముఠాగా ఏర్పడి మోటారు సైకిళ్లను అపహరించుకుపోతున్నారు. ఈక్రమంలో ఇటీవల తణుకు రూరల్ పోలీస్ స్టేషన్‌లో నమోదైన మూడు బైక్ చోరీ కేసుల్లో అనుమానాస్పదంగా వున్న లక్ష్మీనారాయణ, రవితేజలను అదుపులోకి తీసుకుని విచారించగా ఈ మొత్తం వ్యవహారం బట్టబయలైనట్లు తెలిపారు. కేవలం బుల్లెట్ వాహనాలను లక్ష్యంగా చేసుకుని చోరీలకు పాల్పడుతున్నట్లు పోలీసులు గుర్తించినట్లు తెలిపారు. పోలీసులు స్వాధీనం చేసుకున్న మోటారు సైకిళ్ల విలువ రూ. 13 లక్షల 40 వేలు వుంటుందని డీఎస్పీ విశ్వనాథ్ తెలిపారు. నిందితులను అరెస్ట్ చేయడంలో ప్రతిభ కనబర్చిన తణుకు రూరల్ ఎస్ఐ కె.చంద్ర శేఖర్, ఏఎస్ఐ వి.సంగీతరావు, హెడ్ కానిస్టేబుల్ బి.శ్రీనివాస్, కానిస్టేబుల్ ఎస్‌కే అన్వర్, ఎం.శ్రీనివాస్, వి.మధుసూద నరావు, ఎస్. భాస్కరాచారిలను డీఎస్పీ విశ్వనాథ్, సీఐ బీ కృష్ణ కుమార్ అభినందించారు.

కృష్ణానదిలో యువకుడి గల్లంతు

బత్తులవారి గూడెంలో విషాధ చాయలు



శ్యాంకుమార్ (ఫైల్)

నూజివీడు టౌన్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : స్నేహితులతో కలిసి విహారానికి ఆనందంగా వెళ్లిన యువకుడు కృష్ణానదిలో గల్లంతైన సంఘటనతో నూజివీడు మండలం బత్తులవారిగూడెంలో విషాధ చాయలు నెలకొన్నాయి. వివరాల్లోకి వెళితే బత్తులవారిగూడెం గ్రామానికి చెందిన పావులూరి ప్రభాకర్‌రావు కుమారుడు శ్యాంకుమార్ (20) ఎన్టీయార్ జిల్లా గుంటుపల్లి రేవు వద్ద విహారానికి వెళ్ళాడు. స్నానానికి కృష్ణా నదిలో దిగగా నదిలో గల్లంతు అవడంతో అతని స్నేహితులు స్థానిక అధికారులకు సమాచారం ఇవ్వగా గాలింపు చర్యలు చేపట్టిన అధికారులు సోమవారం ఉదయం శ్యాంకుమార్ మృతదేహాన్ని వెలికి తీసి విజయవాడ ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం చేసి మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. దీంతో గ్రామంలో విషాధ చాయలు అలముకున్నాయి.

కలప ట్రాక్టర్ సీజ్



టి.నర్సాపురం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): మర్రిగూడెం అడవిలో నుంచి కలపను అక్రమ రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను ఫారెస్ట్ అధికారులు సీజ్ చేసిన సంఘటన మర్రిగూడెం పంచాయతీ గట్టుగూడెం సమీపంలో సోమవారం చోటు చేసుకున్నది. స్థానికులు, అటవీ అధికారులు తెలిపిన వివరాల మేరకు గట్టుగూడెం గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు అడవి కలపను అక్రమంగా రవాణా చేస్తున్నారని సమాచారంతో అధికారులు దాడి చేసి కలప ఉన్న ట్రాక్టర్ స్వాధీనం చేసుకున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తదుపరి చర్యలు చేపడతామని మక్కినవారిగూడెం బీట్‌గార్డు చలం తెలిపారు.

హత్యాయత్నం కేసులో ఇద్దరికి రిమాండ్

భీమవరం క్రైం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): ఒక వ్యక్తిపై హత్యాయత్నానికి పాల్పడిన ఇద్దరు వ్యక్తులకు కోర్టు 14 రోజుల రిమాండ్ విధించింది. వన్‌టౌన్ ఎస్ఐ ఎస్‌వీవీఎస్ కృష్ణాజీ తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 19వ తేదీన రాత్రి 11.30 గంటల సమయంలో చినపేట అంబేడ్కర్ విగ్రహం వద్ద దాగరపు రాజుపై ఇద్దరు దాడికి పాల్పడ్డారు. దీంతో రాజు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దర్యాప్తు అనంతరం కొత్తపల్లి విక్టర్‌బాబు, నేతల క్రాంతి (బెన్ని) అనే ఇద్దరిపై హత్యాయత్నం కేసు నమోదు చేసి సోమవారం అరెస్ట్ చేశారు. సెకండ్ ఏజెఎఫ్‌సీఎం కోర్టులో హాజరుపరచగా వారిద్దరికి న్యాయ అధికారి 14 రోజుల రిమాండ్ విధించినట్లుగా ఎస్ఐ తెలిపారు.

దాడి కేసులో ఒకరికి రిమాండ్

గత ఏడాది డిసెంబర్ 10వ తేదీన ఉండ్రాజవరపు హేమంత్ శామ్యూల్ అనే వ్యక్తిపై కొత్తపల్లి మహేష్ దౌర్జన్యం చేసి డబ్బు, ఫోను లాక్కున్నాడు. దీనిపై అప్పట్లో కేసు నమోదయ్యింది. సోమవారం కొత్తపల్లి మహేష్‌ను అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ ఎస్‌వీవీఎస్ కృష్ణాజీ తెలిపారు. సెకండ్ ఏజెఎఫ్‌సీఎం కోర్టులో హాజరుపరచగా న్యాయాధికారి అతనికి 14 రోజులు రిమాండ్ విధించినట్లు తెలిపారు.

మెగా డీఎస్సీ నిరుద్యోగులకు కానుక : ఎమ్మెల్యే ధర్మరాజు

ఉంగుటూరు, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి) : ఎన్డీయే కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయడం శుభపరిణామమని ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు అన్నారు. సోమవారం క్యాంపు కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ చంద్రబాబు పుట్టిన రోజున ఈ నోటిఫికేషన్ విడుదల కావడం శుభపరిణామం అన్నారు. పాఠశాలలు తెరవక ముందే టీచర్ పోస్టులు భర్తీకి శ్రీకారం చుట్టడం తమ ప్రభుత్వం చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు.

రేపు నాయుడుగూడెంలో ఉచిత వైద్య శిబిరం

పెదపాడు, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : వల్లూరి సుష్మా మెమోరియల్ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బుధవారం పెదపాడు మండలం నాయుడు గూడెంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు వల్లూరి వెంకటకృష్ణయ్య తెలిపారు. వైద్య శిబిరంలో శంకర నేత్రాలయ వైద్య సిబ్బంది కంటి పరీక్షలు, కామినేని హాస్పటల్ వైద్యులు గుండె జబ్బులకు సంబంధించి వైద్య పరీక్షలు నిర్వహిస్తారన్నారు. వీటితో పాటుగా బీపీ, సుగరు, ఈసీజీలు ఉచితంగా చేస్తారని, పరిసర ప్రాంతాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి

చింతలపూడి, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి) : రాజీ పడదగ్గ కేసులను మే 10వ తేదీన జరిగే జాతీయ లోక్ అదాలత్‌లో పరిష్కరించుకోవాలని స్థానిక జూనియర్ సివిల్ జడ్జి సి.హెచ్.మధుబాబు అన్నారు. కోర్టు ఆవరణలో సోమవారం అవగాహన కల్పించారు. పెండింగ్‌లో ఉన్న కేసులు, రాజీ పడదగ్గ కేసులు లోక్ అదాలత్‌లో పరిష్కరించుకుంటే సొమ్ము, సమయం ఆదా అవుతుందని సూచించారు. పెండింగ్ కేసులు పెరగడంతో కేసుల తీర్పు జాప్యం అవుతోందని, వీటిని పరిష్కరించేలా అధికారులు చైతన్యం తీసుకురావాలని కోరారు. సమావేశంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు కాకర్ల మాణిక్యాలరావు, న్యాయవాదులు, స్థానికులు పాల్గొన్నారు.

బాలభవన్‌లో వేసవి శిక్షణ తరగతులు

ఏలూరు అర్బన్, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి) : పాఠశాల విద్యా శాఖ ఆధ్వర్యంలో ఏలూరు పడమర వీధిలో నిర్వహిస్తున్న జిల్లా బాలభవన్‌లో ఈ నెల 24 నుంచి వేసవి శిక్షణ తరగతులను ప్రారంభిస్తున్నట్టు బాలభవన్ సూపరింటెండెంట్ జి.రవికుమార్ తెలిపారు. ఆరేళ్ల నుంచి 16 ఏళ్ల వయసులోపు ఉన్న బాలబాలికలకు శాస్త్రీయ నృత్యం, చిత్రలేఖనం, గాత్ర సంగీతం, వాయిద్య సంగీతం, టైలరింగ్ విభాగాల్లో శిక్షణ తరగతులు జరుగుతాయన్నారు. ప్రతి రోజు ఉదయం 7.30గంటల నుంచి 10.30వరకు, సాయంత్రం 4.30 గంటల నుంచి 7.30వరకు శిక్షణ ఉంటుందన్నారు. ఆసక్తిగల విద్యార్థులు బాలభవన్‌లోగాని, సూపరింటెండెంట్(99892 07515, 63097 90287)ను సంప్రదించాలన్నారు.

ఉపాధి బకాయిలు వెంటనే విడుదల చేయాలి

ఏలూరు రూరల్/జంగారెడ్డిగూడెం,ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి) :ఉపాధి హామీ కార్మికుల వేతన బకాయిలు విడుదల చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ డిమాండ్ చేశారు. సోమవారం ఏలూరు రూరల్ మండలం మల్కాపురం పంచాయతీ రైల్వే గేట్ దగ్గర ఉపాధి పనులు చేస్తున్న కార్మికుల తో కలిసి కొంతసేపు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ ఉపాధి కార్మికుల వేతనాలను సకాలంలో విడుదల చేయాలని, 15 రోజులకు ఒకసారి వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.జీవరత్నం ఆధ్వర్యంలో జంగారెడ్డిగూడెం ఎంపీడీవో కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. బకాయి వేతనాలు విడుదల చేయాలని కార్యాలయ ఏవో గోపాలకృష్ణకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జోడి సూర్యచంద్రం, అందుగుల ప్రభాకర రావు, నరసారావు, పోతురాజు, అనుమ కుమారి పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ హామీలు అమలు చేయాలి

ఏలూరు రూరల్, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను అమలు చేయాలని కోరుతూ సీపీఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ నాయకులు కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా ఏలూరు ఫైర్ స్టేషన్ వద్ద నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించినట్టు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా నాయకులు బద్దా వెంకట్రావు మాట్లాడుతూ ఎన్నికల మేనిఫెస్టోను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కారం రాఘవ, కె.లత, ఇ.భూషణం, ఎస్ రామ్మోహన్, పీవైఎల్ జిల్లా నాయకులు తగరం బాబూరావు, మంజులూరు సర్పంచ్ కె.ముక్కిరెడ్డి, పీడీఎస్‌యు జిల్లా అధ్యక్షులు కాకి నాని, జిల్లా సహాయ కార్యదర్శి బి.వినోద్, ఐఎఫ్‌టీయూ ఏలూరు నగర ప్రధాన కార్యదర్శి యర్రా శ్రీనివాసరావు, కోరాడ అప్పారావు పాల్గొన్నారు.

నేడు ఎంఎస్ఎంఈ అవగాహన సదస్సు

ఏలూరు రూరల్, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి) : స్వశక్తితో చిన్న పెట్టుబడులతో వ్యాపార రంగంలో ఎదగాలనే యువతకు ఎంఎస్ఎంఈపై మంగళవారం సాయంత్రం ఎస్ హోటల్లో అవగాహన సదస్సు ఏర్పాటు చేసినట్టు ఎస్ ఫౌండేషన్ అధినేత నారా శేషు తెలిపారు. ఎస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం బాలాజీ థియేటర్ సమీపంలో ఉన్న ఎస్ హోటల్లో ఈ సదస్సు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. పారిశ్రామికవేత్తలుగా ఎదగాలనుకునే నిరుపేదలకు ఈసదస్సు ఉపయోగపడుతుందన్నారు. ఈ సదస్సుకు ఎంఎస్ఎంఈ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ తమ్మిరెడ్డి శివశంకర్ రానున్నట్టు తెలిపారు.

వక్ఫ్ బోర్డు సంస్కరణల చట్టం రద్దు చేయాలి

నిడమర్రు ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన వక్ఫ్ బోర్డు సవరణ చట్టాన్ని రద్దు చేయాలని ముస్లింలు డిమాండ్ చేశారు. సోమవారం సీపీఎం ఆధ్వర్యంలో ముస్లింలు నిడమర్రు ప్రజా సంఘాల కార్యాలయం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ముస్లిం సోదరులు మాట్లాడుతూ కేంద్రానికి సుప్రీం కోర్టు మొటిక్కాయలు వేస్తున్నా పట్టించుకోకుండా వక్ఫ్ బోర్డు సంస్కరణల చట్టం తీసుకొచ్చి ముస్లింలకు అన్యాయం చేస్తోందన్నారు. అనంతరం తహసీల్దార్ నాగరాజుకు వినతిపత్రం అందజేశారు. ఈకార్యక్రమంలో ముస్లిం మత పెద్దలు మహమ్మద్ గఫ్ఫార్‌ఖాన్, సాదత్ హుస్సేన్, ఎండీ వహీద్, ఖాసిం, సాధిక్, సీపీఎం నాయకులు ఎన్.రమణారావు, కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి : రాజనాల

కొయ్యలగూడెం, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేస్తున్నట్టు కాంగ్రెస్ పార్టీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు రాజనాల రామ్మోహన రావు అన్నారు. ఈ మేరకు సోమవారం పార్టీ నియోజకవర్గ సమావేశం కొయ్యలగూడెంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడు మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులకు నియామక పత్రాలు అందజేశారు. కాంగ్రెస్ పార్టీలోకి మళ్లీ నాయకులు, కార్యకర్తలు చేరుతున్నారని, పార్టీ బలోపేతానికి రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిల కృషి చేస్తున్నారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా కమిటీ ఉపాధ్యక్షుడు కూనపం రాజారత్నం, నియోజకవర్గ కోఆర్డినేటర్ బండి విజయ్ భాస్కర్, గుత్తుల సత్యనారాయణ పాల్గొన్నారు.

ఆదివాసీలకు మౌలిక సదుపాయాలు కల్పించాలి

కుక్కునూరు, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి) : ఆదివాసీ గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ ప్రజాపంథా జిల్లా కమిటీ కార్యదర్శి ఎస్.కె.గౌస్ డిమాండ్ చేశారు. సోమవారం లంకాలపల్లి గ్రామంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. లంకాలపల్లి, కొత్తనెమలిపేట, లచ్చపేట, తెల్లరాయిగూడెం, అల్లిగూడెం, తదితర గ్రామాల్లో తాగునీటి సౌకర్యం, విద్యుత్ సౌకర్యం, సరైన రహదారులు లేవన్నారు. అంగన్వాడీ, ప్రాథమిక పాఠశాలలు లేకపోవడంతో చిన్నారులు బడికి దూరమవుతున్నారన్నారు. పోడు భూములకు పట్టాలివ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డివిజన్ కార్యదర్శి సోయం చంద్రరావు, ఎస్.కె. మున్నీ, దేవయ్య, మహేశ్ పాల్గొన్నారు.

ఉపాధి హామీ పథకాన్ని ఉపయోగించుకోండి

జంగారెడ్డిగూడెం, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి) : ఉపాధి హామీ పథకాన్ని ఉపయోగించుకోవాలని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి దాసరి శ్యామ్ చంద్రశేషు గ్రామీణ ప్రాంత పేదలకు సూచించారు. సోమవారం మండలంలోని శ్రీనివాసపురంలోని సూరయ్య చెరువులో ఉపాధి హామీ పనులను టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి దాసరి శేషు టీడీపీ నాయకులతో కలిసి కొబ్బరికాయ కొట్టి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉపాధి కూలీలు పనిదినాలు పెంచాలని కోరగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ పోల్నాటి శ్రీనివాసరావు,మండల రైతు అధ్యక్షులు ఎలికే ప్రసాద్, తాళ్లూరి వెంకటేశ్వరరావు, తడికల మోహన్ పాల్గొన్నారు.

డీఐఈవోగా శేఖర్‌బాబు బాధ్యతల స్వీకరణ

(ఐదో పేజీ తరువాయి)

భాగంగా ఇప్పటివరకు జిల్లా వృత్తివిద్యాశాఖాధికారులు (డీవీఈవో)గా వున్న పోస్టులను ప్రభుత్వం డీఐఈవోలుగా పేరుమార్చిన విషయం విదితమే. ఆ మేరకు రాష్ట్రవ్యాప్తంగా 13 జిల్లాలకు రెగ్యులర్ డీఐఈవోలను పదోన్నతిపై నియమిస్తూ ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి కోన శశిధర్ సోమవారం ఉత్తర్వులు జారీచేయగా, ఆ వెంటనే జిల్లాకు నియమితులైన శేఖర్‌బాబు బాధ్యతలు చేపట్టారు. జూనియర్ లెక్చరర్‌గా 1992లో ఉద్యోగ ప్రవేశం చేసిన శేఖర్‌బాబు త్రిపురాంతకం, వినుకొండ, బాపట్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పనిచేసి, 2011లో ప్రిన్సిపాల్‌గా పదోన్నతి పొందారు. రేపల్లె, పిడుగురాళ్ల కళాశాలలు, ఇంటర్‌బోర్డులో కొంతకాలం పనిచేసిన తర్వాత 2021 నుంచి ఇప్పటివరకు పెనుమాక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్‌గా వ్యవహరిస్తున్నారు. గతేడాది ఉత్తమ ప్రిన్సిపాల్ పురస్కారాన్ని రాష్ట్ర ప్రభుత్వం నుంచి అందుకున్నారు. జిల్లాలోని 19 ప్రభుత్వ, 2 ఎయిడెడ్ జూనియర్ కళాశాలల పాలనా వ్యవహారాలను ఈయన పర్యవేక్షిస్తారు. ఇంటర్మీడియట్ పరీక్షల్లో ఫెయిలైన విద్యార్థులకు నిర్వహించనున్న సప్లిమెంటరీ పరీక్షలకు తర్ఫీదునిచ్చేందుకు ఈ నెల 24 నుంచి అన్ని కళాశాలల్లో ఉదయం 9నుంచి సాయంత్రం 4గంటల వరకు ప్రత్యేక తరగతులను నిర్వహించనున్నట్టు ఆయన తెలిపారు. కాగా శేఖర్‌బాబుకు ఇంటర్‌బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణాధికారి (ఆర్‌ఐవో) యోహాన్, డీవీఈవో, ఆర్‌ఐవో కార్యాలయాల సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

సమస్యలకు చెక్ పెట్టండి..

చాణిక్యపురి కాలనీకి ముంపు సమస్య - డ్రైయిన్ ఆక్రమణలే ప్రధాన కారణం

ఎగదన్నుతున్న తమ్మిలేరు వరద - డ్రైయిన్‌ను లెవెల్ చేయాలంటే విజ్ఞప్తులు

ఏలూరు టూటౌన్, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి) : డ్రైయిన్‌ను ఆధునీకరించి చాణిక్యపురి కాలనీని ముంపు బారి నుంచి కాపాడాలని ప్రజలు కోరుతున్నారు. వరదల సమయంలో తమ్మిలేరు నుంచి నీరు ఎగదన్ని చాణిక్యపురి కాలనీ 1వ రోడ్డులో డ్రైయిన్ పొంగిపొర్లుతోంది. డ్రైయిన్, తమ్మిలేరు కాలువకు సమాంతరంగా ఉండటం వల్లే వరదల సమయంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోందని ప్రజలు వాపోతున్నారు. డ్రైయిన్ లోతుగా తవ్వడం మరింత ప్రమాదకరంగా మారిందని, ఈ డ్రైయిన్‌ను ఆక్రమించడం మరో సమస్య అని స్థానికులు పేర్కొంటున్నారు. చిరు వ్యాపారులు మెట్లు నిర్మించుకోవడం, చెత్త పేరుకుపోవడం వంటి కారణాలతో మురుగు పారడం లేదు. ఈ డ్రైయిన్‌కు ఆర్‌ఆర్‌పేటలోని ప్రభుత్వ ఆసుపత్రి డ్రైయిన్‌ను పత్తే బాద మీదుగా బృందావనం పార్కు నుంచి చాణిక్యపురి 1వ రోడ్డుకు కలుపుతున్నారు. అంత దూరం నుంచి డ్రైయిన్ కలపడంతో చెత్త పేరుకుపోయి డ్రైయిన్ పారక మురుగు దుర్గంధం పెరిగి స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. అంతేకాక డ్రైయిన్‌ను ఆనుకుని ఉన్న 40 అడుగుల పుంత ఆక్రమణకు గురైంది. ఈ పుంత పక్కనే ఉన్న 20 అడుగుల రోడ్డు ఉంది. డ్రైయిన్ వెడల్పు చేయడంతో పక్కన 20 అడుగుల రోడ్డు కుంచించుకుపోయింది. దీంతో రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డును పెంచి డ్రైయిన్‌ను లెవెల్ చేసి ఆక్రమణలు తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.



తమ్మిలేరులోకి వెళ్తున్న డ్రైయిన్



ఆక్రమణలకు గురైన డ్రైయిన్

ఆక్రమణలు తొలగించండి



ఆక్రమణలకు గురైన 40 అడుగుల పుంతను ఖాళీ చేయించాలి. దాంతో పాటు పక్కన 20 అడుగుల రోడ్డుతో కలిపి 60 అడుగుల రోడ్డు నిర్మించాలి. తమ్మిలేరువాటర్ డ్రైయిన్‌లోకి రావడం వలన ఆ ఏరియాలో అద్దెకు రావడానికి కూడా ప్రజలు భయపడుతున్నారు. ముగ్గురు ఎమ్మెల్యేలకు ఫిర్యాదు చేశాం. అయినా ఎటువంటి చర్యలులేవు.

షేక్ హుస్సేన్, చాణిక్యపురి వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు

డ్రైయిన్‌ను లెవెల్ చేయాలి



డ్రైయిన్ తమ్మిలేరు లోతుకు సమాంతరంగా ఉండటంతో వర్షాలు వచ్చినప్పుడు తమ్మిలేరులో అధిక వాటర్ వచ్చినప్పుడు ఆ వాటర్ డ్రైయిన్‌లోకి ఎగదన్నుతోంది. డ్రైయిన్ అంతా నిండిపోయి మురుగు, వాటర్ కలిసి కాలనీ అంతా వ్యాపిస్తోంది. డ్రైయిన్‌ను లెవెల్ చేయాలి. తమ్మిలేరు వాటరు డ్రైయిన్‌లోకి రాకుండా చర్యలు తీసుకోవాలి.

భాస్కరరావు, చాణిక్యపురి వెల్ఫేర్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్





ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్ వెట్రిసెల్వి, జేసీ ధాత్రిరెడ్డి, ఎస్పీ కేపీఎస్ కిశోర్

అర్జీల పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ : కలెక్టర్

ఏలూరు రూరల్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమం ద్వారా అందిన అర్జీల పరిష్కారానికి ప్రత్యేక శ్రద్ధ వహించాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ గోదావరి సమావేశ మందిరంలో సోమవారం జరిగిన పీజీఆర్‌ఎస్ కార్యక్రమంలో కలెక్టర్‌తో పాటు జేసీ ధాత్రిరెడ్డి, డీఆర్వో విశ్వేశ్వరరావు, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ ముక్కంటి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు భాస్కర్, శ్రీనివాసరావు, ఏడీ సర్వే ఎండీ అన్సారీలతో కలిసి అర్జీలను స్వీకరించారు. అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యానికి తావులేదని స్పష్టం చేశారు. వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు : ఎస్పీ

ఏలూరు క్రైం, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): ప్రజల సమస్యలను పరిష్కరించడానికి పోలీస్ శాఖ ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందని ఎస్పీ కె.పి.ఎస్.కిశోర్ అన్నారు. ఏలూరు జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో సోమవారం ఎస్పీ కిశోర్, అదనపు ఎస్పీ ఎన్.సూర్యచంద్రరావులు అర్జీలు స్వీకరించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రతి ఫిర్యాదుపై పూర్తి స్థాయిలో విచారణ జరిపి చట్ట ప్రకారం న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సైబర్ నేరానికి గురైతే వెంటనే 1930కు సమాచారం ఇవ్వాలని ఎస్పీ సూచించారు. ప్రజా ఫిర్యాదుల వేదికకు జిల్లా నలుమూలల నుంచి హాజరైన వారికి ఏలూరు సత్య సాయి ట్రస్టు ఆధ్వర్యంలో ఉచిత భోజనాలు ఏర్పాటు చేశారు.



బడిబాట ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

శనివారపుపేటలో ఇంటింటా బడిబాట

ఏలూరు రూరల్, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి) : శనివారపుపేట గ్రామంలో ఉర్దూ పాఠశాల హెచ్ఎం వహీదా బేగం ఆధ్వర్యంలో విద్యార్థుల ప్రవేశం కోసం సోమవారం బడిబాట కార్యక్రమం ఇంటింటా నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలలో అన్ని సౌకర్యాలున్నాయని విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని తల్లిదండ్రులను కోరారు. పాఠశాలలో నాణ్యమైన విద్యను అందించేందుకు ఉపాధ్యాయులు సిద్ధంగా ఉన్నారన్నారు. ప్రభుత్వ పాఠశాల బలోపేతం కోసం గ్రామస్థులంతా సహకరించాలని బడిబాటలో కోరారు. ఎస్ఎంసీ అధ్యక్షుడు, సభ్యులు విద్యార్థులు పాల్గొన్నారు.



ఎమ్మెల్సీ పేరాబత్తులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే చంటి

ఎమ్మెల్సీ పేరాబత్తులకు సత్కారం

ఏలూరుటూటౌన్, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖర్‌ను కోరారు. టీడీపీ జిల్లా కార్యాలయంలో నోబుల్ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖర్ అభినందన సభ జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే చంటి ఎమ్మెల్సీ రాజశేఖర్‌ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ కె.ఎస్.రామకృష్ణ పాల్గొన్నారు.

మోటార్ సైకిల్ ఢీకొని యువకుడి మృతి

ఏలూరు క్రైం, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి) : పోలవరం కాల్వ గట్టుపై నడిచి వెళ్తున్న ఒక యువకుడిని సోమవారం రాత్రి మోటార్ సైకిల్ ఢీకొట్టగా తీవ్ర గాయాలతో మృతి చెందాడు. పెదవేగి మండలం అంకన్న గూడెం గ్రామానికి చెందిన పర్స సాయికిరణ్(22) గ్రామ సమీపంలోని పోలవరం కాల్వ గట్టుపై సోమవారం రాత్రి నడిచి వెళ్తుండగా అదే గ్రామానికి చెందిన వేమూరి రమేశ్ అతివేగంగా మోటార్ సైకిల్‌పై వస్తుండగా చీకట్లో సాయి కిరణ్ కనిపించక ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో సాయి కిరణ్‌కు తీవ్ర గాయాలవడంతో ఏలూరు ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకొచ్చారు. అప్పటికే యువకుడు మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. ఈ ఘటనపై ఆస్పత్రి వైద్యులు ఎమ్మెల్సీగా నమోదు చేసి ఆసుపత్రి అవుట్ పోస్ట్ పోలీసులకు సమాచారమిచ్చారు.

ఆదివాసీలకు న్యాయం చేయాలి

బుట్టాయగూడెం, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): ఆదివాసీ ప్రత్యేక డీఎస్సీ కోసం ఆర్డినెన్స్ తీసుకురావాలని ఏపీ ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు తెల్లం రామకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం జైనవారిగూడెంలో జరిగిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో పాల్గొని మాట్లాడుతూ ప్రభుత్వం ప్రకటించిన మెగా డీఎస్సీలో ఆదివాసీలకు తీరని అన్యాయం జరిగిందని తెలిపారు. ఏజెన్సీ ప్రాంతంలో 100 శాతం ఆదివాసీలకు ఉద్యోగ, ఉపాధ్యాయ రిజర్వేషన్లు పునరుద్ధరిస్తామని చంద్రబాబు హామీ ఇచ్చినట్టు తెలిపారు. ఇచ్చిన హామీ మేరకు గిరిజనులకు న్యాయం జరిగేలా చూడాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు మొడియం నాగమణి, కారం భాస్కర్, కె.సత్య నారాయణ, ఎస్.శ్రీను, ఎం.అనూష పాల్గొన్నారు.

దేవరకొండ పోలీస్ స్టేషన్ రీ రిలీజ్ చేస్తాం

జంగారెడ్డిగూడెం, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి) : సమాజంలో జరుగుతున్న అసాంఘిక కార్యకలాపాలు, మాదక ద్రవ్యాల వాడకం యువతపై ఏవిధంగా ప్రభావితం చేస్తున్నాయో అనే అంశంతో రూపొందించిన 'దేవరకొండ పోలీస్ స్టేషన్' సినిమాను మే నెల రెండవ వారంలో రీ రిలీజ్ చేస్తున్నట్టు చిత్ర దర్శకుడు కాళీ చరణ్ తెలిపారు. సోమవారం జంగారెడ్డిగూడెంలోని అంబికా హోటల్లో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ప్రముఖ హీరో సుమన్ ఈ చిత్రంలో ప్రధాన పాత్ర పోషించారని, పట్టణానికి చెందిన ఉక్కుర్తి దుర్గారావు విలన్‌గా నటించారని తెలిపారు. యువతకు సందేశాన్నిచ్చే ఈ చిత్రాన్ని ఇంతకు ముందులాగానే ఆదరించాలని ఆయన కోరారు.

శివ పూజతో ఆలయాల హోరు



ఏలూరు కార్పొరేషన్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని పలు డివిజన్లలోని శివాలయాల వద్ద సోమవారం భక్తులు అధిక సంఖ్యలో అభిషేకాలు, అర్చనలు నిర్వహించడంతో పూజలతో హోరెత్తాయి. శివ నామస్మరణతో మార్మోగింది. వేకువ జాము నుంచే భక్తులు స్వామిని దర్శించుకుని ఆరాధించారు. శివ పురాణాలను పఠించారు. అగ్రహారంలోని నగరేశ్వరాలయం, పాత శివాలయం, పవరు పేటలోని కాశీ విశ్వేశ్వరాలయం, శివ నగర్‌లోని మల్లికార్జునస్వామి ఆలయం, దక్షిణపు వీధిలోని మార్కండేయ స్వామి ఆలయం, జరాపహరేశ్వర స్వామి ఆలయం, బావి శెట్టివారిపేట, నాగేశ్వరపురంలోని శివాలయాల వద్ద, పత్తేబాద, ఆదివారపుపేటలలోని రామలింగేశ్వరస్వామి ఆలయాల వద్ద భక్తులు శివపూజలతో హోరెత్తించారు.





ప్రత్యేక అలంకరణలో వీరేశ్వరస్వామి, భోగలింగేశ్వరస్వామి

పట్టిసీమ క్షేత్రంలో ప్రత్యేక పూజలు

పోలవరం, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి) : పట్టిసీమ భద్రకాళీసమేత వీరేశ్వరస్వామికి సోమవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గుంజవరం గ్రామంలో స్వయంభువుగా వెలసిన ఉమాసహిత భోగలింగేశ్వరస్వామికి , పోలవరంలో వాసవీ కన్యకాపరమేశ్వరీ సమేత నగరేశ్వర స్వామికి, కొత్తపట్టిసీమ శివాలయంలో, బోటు ఆఫీసు శివాలయం, నూతనగూడెం శివాలయాల్లో భక్తులు భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ఆలయాలలో ఏకాదశ రుద్రాభిషేకం, పంచామృత, భస్మాభిషేకాలు నిర్వహించారు. కార్యక్రమంలో అర్చకులు పైడిపల్లి ఫణికుమార్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

అమెరికా ఉపాధ్యక్షుడి దిష్టిబొమ్మ దహనం

ద్వారకాతిరుమల, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): అమెరికాతో ద్వైపాక్షిక స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం పాడి, వ్యవసాయ రంగాలకు మరణశాసనం వంటిదని ఏపీ రైతు సంఘం ఆరోపించింది. ఈ మేరకు నాగులపల్లిలో అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ దిష్టిబొమ్మను దహనం చేశారు. వాన్స్ గోబ్యాక్ అంటూ నినాదాలు చేశారు. సుంకాలు, మార్కెట్ పరిమితులు తొలగిస్తే దేశానికి అమెరికా పాడి ఉత్పత్తులు దిగుమతయ్యి స్థానిక రైతులు నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. నిరసన తెలిపిన వారిలో ఏపీ రైతు సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాస్, కట్టా భాస్కరరావు, గుర్రం రాంబాబు బిసత్యనారాయణ, మురళి, నాగరాజు, పలువురు పాడి రైతులు పాల్గొన్నారు.

మంత్రి పర్యటనను విజయవంతం చేయాలి

బుట్టాయగూడెం, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి) : ఈ నెల 22, 23 తేదీల్లో జరిగే మంత్రి నాదెండ్ల మనోహర్ ఏజెన్సీ పర్యటనను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే చిర్రి బాలరాజు తెలిపారు. మంత్రి ఏజెన్సీ పర్యటనపై సోమవారం కె.ఆర్.పురం ఐటీడీఏలో ప్రాజెక్టు ఆఫీసర్ కె.రాములు నాయక్‌తో కలిసి అన్నిశాఖల అధికారులతో సమీక్ష చేపట్టారు. పర్యటనకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని అన్నారు. సెక్యూరిటీ విషయంలో అప్రమత్తంగా ఉండాలని పోలీసులను ఆదేశించారు.



చెస్ పోటీల్లో అవార్డులు గెలుచుకున్న చిన్నారులు

ఇన్విటేషన్ చెస్ విజేత నవ్య సాహితీ

ఏలూరు, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి) : లిటిల్ మాస్టర్స్ చెస్ అకాడమీ, దీప్తి చెస్ అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం జరిగిన ఇన్విటేషన్ చెస్ పోటీల్లో నవ్య సాహితీ ప్రథమ స్థానంతో సత్తా చాటింది. లోహితాక్షి (ద్వితీయ), నవదీప్ (తృతీయ), గీతిక (నాల్గోస్థానం), హన్షిత్‌రెడ్డి(ఐదోస్థానం)లో నిలిచారు.అండర్-5లో విరాజ్, అండర్-7లో మహితి అనిరుద్, అండర్-9లో సౌర్య జెస్సీ ఎంజిల్, యోగిత అండర్-11లో మోక్షిత్, అండర్-13లో ప్రణీత, అండర్-15లో అక్షితలు ప్రథమ స్థానాలను వశం చేసుకున్నారు. విజేతలకు బహుమతుల ప్రదానోత్సవంలో లిటిల్ మాస్టర్స్ చెస్ అకాడమీ డైరెక్టర్ డి.లక్ష్మణరావు, దీప్తి చెస్ అకాడమీ డైరెక్టర్ కె. కృష్ణకుమారి, సిటీ కంప్యూటర్స్ అధినేత వేణుగోపాల్, ఆర్బిటర్‌గా సూర్యనారాయణ, సుధీర్ ముఖ్య అతిథులుగా హాజరై షీల్డులు, సర్టిఫికెట్లను అందజేశారు.



ఉపాధ్యాయిని గీతాంజలిని సత్కరిస్తున్న దృశ్యం

గీతాంజలికి ఉద్యోగ విరమణ సత్కారం

ఏలూరు రూరల్, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయ వృత్తికి వన్నెతెచ్చి పాఠశాల అభివృద్ధికి ఉపాధ్యాయిని గీతాంజలి కృషి చేశారని వక్తలు కొనియాడారు. శనివారపుపేట జడ్పీ ఉన్నత పాఠశాలలో సోషల్ ఉపాధ్యాయునిగా పనిచేస్తున్న గీతాంజలికి పాఠశాల ఆవరణలో సోమవారం ఉద్యోగ విరమణ సత్కారం చేశారు. ముఖ్య అతిధిగా హాజరైన పాఠశాల హెచ్ఎం ప్రకాశ్ మాట్లాడుతూ విద్యార్థులెందరినో ఉన్నతులుగా తీర్చిదిద్దారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు రాజశేఖర్, పీడీ పద్మలత, విల్సన్, శారద పాల్గొన్నారు.

మంత్రి మనోహర్‌కు ఘన స్వాగతం

ఏలూరు రూరల్, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి) : మూడు రోజుల పాటు ఏలూరు జిల్లాలో జరిగే పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొనేందుకు ఏలూరు వచ్చిన పౌర సరఫరాల శాఖ మంత్రి ఏలూరు జిల్లా ఇన్‌చార్జీ మంత్రి నాదెండ్ల మనోహర్‌ను ఏలూరు బైపాస్ వద్ద ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా అధ్యక్షులు కొటికలపూడి గోవింద రావు(చినబాబు), గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరం కలిసి ఘనస్వాగతం పలికారు. రాష్ట్ర కార్యదర్శి, దెందులూరు సమన్వయకర్త ఘంటసాల వెంకటలక్ష్మీ, గోపాలపురం జనసేన ఇన్‌చార్జీ దొడ్డిగర్ల సువర్ణరాజు, నూజివీడు జనసేన పార్టీ ఇన్‌చార్జి భర్మా ఫణి పాల్గొన్నారు.

టీడీపీ వార్డు కమిటీల నియామకం

జంగారెడ్డిగూడెం, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి) : టీడీపీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు వార్డు కమిటీలను వేగవంతంగా ఏర్పాటు చేస్తున్నామని టీడీపీ పట్టణ అధ్యక్షుడు రావూరి కృష్ణ అన్నారు. రావూరి కృష్ణ ఆధ్వర్యంలో సోమవారం 27, 28, 29 వార్డుల్లో నూతన కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. 27వ వార్డు అధ్యక్షుడిగా చిట్టూరి బాపినీడు, 28వ వార్డుకు కొత్తూరి సత్తిబాబు, 29 వ వార్డు అధ్యక్షురాలిగా పంపాని మంగేశ్వరి ఎన్నికయ్యారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మండవ లక్ష్మణరావు, పెనుమర్తి రామకుమార్, మద్దిపాటి నాగేశ్వరరావు, షేక్ ముస్తఫా, తూటిగుంట రాము, అబ్బిన దత్తాత్రేయ, కొండ్రెడ్డి కిశోర్, గుమ్మడి ప్రసాద్, నంబూరి రామచంద్ర రాజు, చిట్టిబోయిన రామలింగేశ్వర రావు, చెరుకూరి శ్రీధర్, బొబ్బర రాజ్‌పాల్ కుమార్, మారిశెట్టి బాల చిట్టెమ్మ తదితర నాయకులు పాల్గొన్నారు.

శ్మశానానికి స్థలం చూపండి

చింతలపూడి, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : గ్రామంలో ఎవరైనా చనిపోతే పూడ్చడానికి, కాల్చడానికి కనీస స్మశాన స్థలం కూడా లేక ఇబ్బందులు పడుతున్నామని శివపురం గ్రామస్థులు తహసీల్దార్‌కు విన్నవించారు. ఈ గ్రామంలో సుమారు 2 వేల 500 మంది జనాభా ఉన్నారని, ఇప్పటివరకు చనిపోయిన వారిని కాలువ గట్ల మీద దహనం చేసినట్టు గ్రామస్థులు తెలిపారు. వ్యవసాయ భూములున్న రైతులు అభ్యంతరం చెబుతున్న నేపథ్యంలో సమస్య ఉత్పన్నమైందని స్పష్ట చేశారు. గతంలో గ్రామ పెద్దలకు, అధికారులకు విన్నవించినా ఫలితం లేదని సామాజిక కార్యకర్త ఇ.వి.శ్రీనివాస రావు పేర్కొన్నారు. ఈ మేరకు తహసీల్దార్‌కు సమస్యను వివరిస్తూ విన్నవించినట్టు గ్రామస్థులు తెలిపారు.

డీఎల్‌ఎడ్ సెమిస్టర్ పరీక్షలు ప్రశాంతం

ఏలూరు అర్బన్, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి) : డీఎల్‌ఎడ్ 3వ సెమిస్టర్ పరీక్షల్లో భాగంగా సోమవారం జరిగిన పరీక్షకు జిల్లాలో 48 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా అంతా హాజరయ్యారని, 1వ సెమిస్టర్ పరీక్షకు 97 మంది విద్యార్థులకు 93మంది హాజరయ్యారని డీఈవో వెంకటలక్ష్మమ్మ తెలిపారు.

మెగా డీఎస్సీపై ఆప్టా హర్షం

పెదవేగి, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి) : మెగా డీఎస్సీ ప్రకటించడం పట్ల ఆంధ్రప్రదేశ్ టీచర్స్ అసోసియేషన్(ఆప్టా) ఏలూరు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సీహెచ్.శివరామ్, ఎం.శ్రీనివాసరావు, ఫైనాన్స్ కార్యదర్శి ఎస్.దుర్గాప్రసాద్‌లు హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఇచ్చిన షెడ్యూల్ ప్రకారం డీఎస్సీని విజయవంతంగా నిర్వహించి, నిరుద్యోగ యువత కుటుంబాల్లో వెలుగు నింపాలని వారు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

కొవ్వాడ గట్లు పునరుద్ధరణ

పోలవరం, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి) : గత ఏడాది వరదలకు వర్షాలకు దెబ్బతిని జారిపోయిన కొవ్వాడ కాలువ గట్ల పునరుద్ధరణ కార్యక్రమం సోమవారం నాటికి కొంతమేర పూర్తయ్యిందని ఏఈ రాహుల్ భాస్కర్ తెలిపారు. ఎల్.ఎం.డి.పేట రిజర్వాయర్ నుంచి 6.5 కిలోమీటర్ల వద్ద 100 మీటర్ల మేర దెబ్బతిన్న ప్రాంతంలో పాపాయమ్మ చెరువు నుంచి మట్టిని తరలించి పనులు చేస్తున్నామని తెలిపారు. కాలువకు ఐదు ప్రాంతాల్లో దెబ్బతిన్న గట్ల పునరుద్ధరణ కోసం రూ.19 లక్షల మంజూరయ్యాయని యుద్ధ ప్రాతిపదికన పనులు చేపట్టినట్టు మే నెలాఖరు నాటికి పనులు పూర్తవుతాయని ఏఈ తెలిపారు.

పోప్ ఫ్రాన్సిస్ మరణంపై దిగ్భ్రాంతి

ఏలూరు టూటౌన్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): కెథలిక్ అత్యున్నత మత గురువు పోప్ ఫ్రాన్సిస్ మరణం పట్ల ఏలూరు కథోలిక పీఠాధిపతులు బిషప్ జయరావు పొలిమేర తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. పోప్ ఫ్రాన్సిస్ కరుణ, మానవత్వం ఆధ్యాత్మికం, ధైర్యానికి ప్రతీక అన్నారు. పోప్ మరణం పట్ల ప్రపంచ కెథలిక్ కమ్యూనిటీకి ప్రగాఢ సానుభూతి తెలుపుతున్నామన్నారు. నేత్రాసనం ప్రొక్యూరేటర్ ఫాదర్ బి.రాజు ఫాదర్ దిరిసిన ఆరోన్‌లు సంతాపం తెలిపారు.

ప్రకృతి సేద్యంతో ప్రయోజనం

కామవరపుకోట, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి) : రైతాంగం మేల్కొని ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలని, తద్వారా రైతులకు పెట్టుబడి భారం తగ్గుతుందని, నాణ్యతా ప్రమాణాలు కలిగిన ఉత్పత్తులు లభిస్తాయని ఆడమిల్లి సర్పంచ్ గూడపాటి కేశవరావు పేర్కొన్నారు. ఆడమిల్లి గ్రామంలోని కంచి కామాక్షి ఆలయంలో సోమవారం రైతులతో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గ్రామంలో ప్రకృతి వ్యవసాయం చేస్తున్న మలకలపల్లి రాఘవయ్య, కాసరనేని వెంకటరత్నం, కాకర్ల వెంకట్రావు, నల్లమిల్లి మోహన్‌రావు, మద్దిపాటి సత్యనారాయణ, గూడపాటి సుబ్బారావు, టోకూరి జేమ్స్, కలసాని మాణిక్యాలరావు, పొడపాక బ్రహ్మచారి, మల్లెల్లి రత్నమ్మ, కఠారి భాస్కరరావులను దుశ్శాలువాలతో సత్కరించి నవధాన్యాల కిట్లను అందజేశారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయం టీమ్ సభ్యులు సుబ్బరాజు, దుర్గాదేవి, నవీన్‌షా, మురళీ, రత్నంరాజు పాల్గొన్నారు.



న్యాయమూర్తికి పూలమొక్క అందజేస్తున్న ఎస్పీ

జిల్లా ప్రధాన న్యాయమూర్తిని మర్యాదపూర్వకంగా కలిసిన ఎస్పీ

ఏలూరు క్రైం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన సిరిపురం శ్రీదేవిని ఏలూరు జిల్లా ఎస్పీ కేపీఎస్ కిశర్ సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్కను అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఏలూరు జిల్లా కోర్టులోని జిల్లా జడ్జి చాంబర్‌లో కలిసి కేసుల నివారణ, మహిళా భద్రత వంటి చర్యలపై చర్చించారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా ఎస్.శ్రీదేవి బాధ్యతలు చేపట్టడం పోలీస్ శాఖకు గౌరవం అని ఎస్పీ పేర్కొన్నారు.

స్వచ్ఛాంధ్ర విధివిధానాలపై చర్చ

పెదవేగి, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి) : స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభి దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌ను దుగ్గిరాల క్యాంపు కార్యాలయంలో సోమవారం కలిశారు. నియోజకవర్గంలో స్వచ్ఛాంధ్ర పథకంలో చేస్తున్న పనులు, చేయాల్సిన విధి విధానాలపై చర్చించారు. ఈ సందర్భంగా పట్టాభి మాట్లాడుతూ స్వచ్ఛాంధ్ర అనేది ఒక ఉద్యమంలా నిర్వహిస్తామన్నారు.

30వ తేదీ వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కైకలూరు, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): విద్యుత్ మరమ్మతుల కోసం మంగళవారం నుంచి ఈ నెల 30వ తేదీ వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని గుడివాడ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జీబీ శ్రీనివాసరావు తెలిపారు. కొత్త విద్యుత్ లైన్లను ఏర్పాటు చేసేందుకు గాను కైకలూరు మండలం వరహాపట్నం సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. ప్రతి రోజు ఉదయం 7గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు మధ్యాహ్నం 3గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు.

25 అర్జీలు అందజేత

నూజివీడు టౌన్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : నూజివీడు సబ్ కలెక్టర్ కార్యాలయ సమావేశం మందిరంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమంలో సబ్ కలెక్టర్ బచ్చు స్మరణ్‌రాజ్ ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు అందించిన వినతులలోని సమస్యలు సకాలంలో పరిష్కరిస్తామన్నారు. మొత్తం డివిజన్ వ్యాప్తంగా 25 అర్జీలు దాఖలైనట్లు ఆయన తెలిపారు.


ఆటపాక మంచినీటి చెరువులో ధ్వంసమైన మెట్లరేవు

ఆటపాక మంచినీటి చెరువు మెట్లరేవు ధ్వంసం

కైకలూరు, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): ఆటపాక మంచినీటి చెరువులోని మెట్లరేవు ధ్వంసమైంది. గ్రామంలోని ప్రజలు నేరుగా మంచినీటి చెరువులోని నీటిని తీసుకువెళ్లేందుకు వీలుగా మెట్ల రేవులను ఏర్పాటు చేశారు. అయితే వాటి సంరక్షణ పట్టించుకోకపోవడంతో అవి పూర్తిగా ధ్వంసమై ప్రజలు చెరువులో దిగలేని పరిస్థితులు నెలకొన్నాయి. సమస్య చిన్నగా ఉన్నప్పుడు అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి కనీస మరమ్మతులు చేసివుంటే ఈ దుస్థితి వచ్చేది కాదని ప్రజలు వాపోతున్నారు. సంవత్సరాల తరబడి ఎవ్వరూ పట్టించుకోకపోవడంతో ప్రస్తుతం ప్రజలెవ్వరూ మెట్లగుండా చెరువులోనికి దిగలేని పరిస్థితులు నెలకొన్నాయి.

మండే.. ఎండ!

కలిదిండి, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): కలిదిండిలో సోమవారం ఎండ దారెత్తించింది. 40 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఎండ తీవ్రత అధికంగా ఉండటంతో సాయంత్రం 5 గంటల వరకు జనం బయటకు రాకపోవటంతో రోడ్లు నిర్మానుష్యంగా మారాయి. మూగ జీవాలు సైతం అల్లాడిపోయాయి. ఏప్రిల్‌లో ఎండలు ఈ విధంగా ఉంటే మే నెలలో రోహిణి కార్తెలో ఎండలు ఇంకా అధికంగా ఉండే అవకాశం ఉంటుందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.


నీటి కుంటలో సేదతీరుతున్న శునకం







పెయ్యేరు కాలనీలో నిరుపయోగంగా అంగన్‌వాడీ కేంద్ర భవనం.. పెనుమల్లిలో పాడైపోయి మూతబడిన అంగన్‌వాడీ కేంద్రం.. గురజలో శిథిలమై మూతబడిన అంగన్‌వాడీ కేంద్రం

శిథిల భవనాలు

- నిర్వహణలేని అంగన్‌వాడీ భవనాలు
- మూతపడుతున్నా పట్టించుకునే వారు లేరు
- పథకాల నిర్వహణకే పరిమితమైన ఐసీడీఎస్

ముదినేపల్లి, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో అంగన్ వాడీ కేంద్రాల భవనాల నిర్వహణ లోపభూయిష్టంగా తయారైంది. సకాలంలో మరమ్మతులకు నోచుకోక లక్ష లాది రూపాయల విలువైన భవనాలు శిథిలమై కూలే దశకు చేరుకుని చివరికి మూతబడిపోతున్నాయి. ప్రమాదకర స్థాయికి చేరే వరకు ఈ భవనాల అతీగతి పట్టించుకున్న నాథుడే లేడు. స్త్రీ, శిశు సంక్షేమశాఖ కేవలం అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ, పౌష్టికాహారం తదితర ప్రభుత్వ పథకాల అమలుకే పరిమితం కాగా, భవనాల నిర్వహణ, నిధులు మంజూరుకు అవకాశం లేదు. ముదినేపల్లి మండలంలోని పలు గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాల భవనాలు శిథిలమై మూతబడి పోయాయి. మండలంలోని గురజ, పెనుమల్లి, పెయ్యేరు కాలనీ తదితర గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల భవనాలు మూతపడగా, వాటిని ప్రైవేట్ భవనాల్లో అద్దెకు నిర్వహిస్తున్నారు. ఈ కేంద్రాల భవనాలపై మొక్కలు మొలిచి భవనాలు బీటలు వారే విధంగా చేస్తున్నాయి. మొక్కలను పీకించేందుకు కూడ అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోకపోవటంతో శ్లాబులు సైతం బీటలు వారాయి. భవనాల గోడలు చవుడు బారుతున్నప్పటికీ సంబంధిత స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధికారులు ఏళ్ల తరబడి తమకేమీ పట్టనట్లే వ్యవహరించటంతో మండలంలో పలు అంగన్‌వాడీ కేంద్రాల భవనాలు నిరుపయోగంగా మారాయి. చిన్న చిన్న మరమ్మతుల విషయంలో అధికారులు నిర్లక్ష్యం చేయటంతో భవనాలు పూర్తిగా పాడైపోయి శిథిలం కాగా, ప్రమాదకర పరిస్థితుల్లో అంగన్‌వాడీ కేంద్రాలను ప్రైవేట్ భవనాల్లోకి తరలిస్తున్నారు. ఈ కేంద్రాల కార్యకర్తలు భవనాలు పాడైపోతున్న విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తున్నా ఫలితం లేకుండాపోతున్నది. ఇక భవనాల మరమ్మతులకు నిధులు మంజూరు స్త్రీ, శిశు సంక్షేమ శాఖ చేతుల్లో లేదు. పంచాయ తీరాజ్ శాఖ నిధులు మంజూరు చేయాల్సి ఉంది. అంగ్‌వాడీ కేంద్రాల భవనాలను గ్రామపంచాయతీ పట్టించుకున్న దాఖలాలే లేవు.

మండల పరిషత్, జిల్లా పరిషత్‌ల నుంచి నిధులు మంజూరు చేయాలి అయితే భవనాల మరమ్మతులకు స్త్రీ, శిశు సంక్షేమశాఖ ప్రాజెక్టు అధికారులు ఎప్పుడైనా జిల్లా పరిషత్‌కు ప్రతిపాదనలు పంపినా నిధులు ఎప్పటికి మంజూరవుతాయో తెలియని పరిస్థితి నెలకొంది. అక్కడి నుంచి నిధులు మంజూరయ్యే సమయానికి అంగన్‌వాడీ కేంద్రాల భవనాలు పూర్తిగా శిథిలమై పనికి రాకుండా పోతున్నాయి. ముదినేపల్లి మండలంలో పలు అంగన్‌వాడీ కేంద్రాల భవనాలు పాడైపోయి మరమ్మతులకు ఎదురుచూస్తున్నాయి. నిధులు ఎప్పటికీ వస్తాయో చూడాలి.



సామూహిక సీమంతాలు

ముదినేపల్లి, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): వడాలి గ్రామంలో సోమవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పౌష్టికాహార పక్షోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా గ్రామంలో గర్భిణులకు సామూహిక సీమంతాలు జరిపారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రసన్న ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మహిళల్లో రక్తహీనత ఏర్పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సిబ్బంది పలు సూచనలు చేశారు. అంగన్‌వాడీ కార్యకర్తలు నాగ జ్యోతి, సుప్రభాత, విజయలక్ష్మి, జగదీశ్వరి పాల్గొన్నారు.

ప్రాథమిక పాఠశాలల్లో అడ్మిషన్లు

ముదినేపల్లి, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించేందుకు సోమవారం ముదినేపల్లి మండలంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. మండల విద్యాశాఖ అధికారి కె.నరేష్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మండలంలోని పలు అంగన్‌వాడీ కేంద్రాలకు చెందిన 5 సంవత్సరాల వయస్సు నిండిన పిల్లలను ఎలిమెంటరీ పాఠశాలల్లో ఒకటవ తరగతిలో చేర్పించారు. మూడు రోజులపాటు జరుగనున్న ఈ స్పెషల్ డ్రైవ్‌లో తొలిరోజు సుమారు 100 మందికి పైగా 5 సంవత్సరాలు నిండిన పిల్లలను ఒకటవ తరగతిలో అడ్మిషన్లు ఇచ్చినట్లు సమాచారం. సంకర్షణపురం ఉర్దూ పాఠశాల, పెయ్యేరు, గురజ-1, వాడవల్లి, కాకరవాడ, చిగురుకోట తదిరత గ్రామాల్లోని ఎలిమెంటరీ పాఠశాలల్లో విద్యార్థులు అడ్మిషన్లు తీసుకున్నారు.

డీఐఈవోగా శేఖర్‌బాబు బాధ్యతల స్వీకరణ

(ఐదో పేజీ తరువాయి)

భాగంగా ఇప్పటివరకు జిల్లా వృత్తివిద్యాశాఖాధికారులు (డీవీఈవో)గా వున్న పోస్టులను ప్రభుత్వం డీఐఈవోలుగా పేరు మార్చిన విషయం విదితమే. ఆ మేరకు రాష్ట్రవ్యాప్తంగా 13 జిల్లాలకు రెగ్యులర్ డీఐఈవోలను పదోన్నతిపై నియమిస్తూ ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి కోన శశిధర్ సోమవారం ఉత్తర్వులు జారీచేయగా, ఆ వెంటనే జిల్లాకు నియమితులైన శేఖర్‌బాబు బాధ్యతలు చేపట్టారు. జూనియర్ లెక్చరర్‌గా 1992లో ఉద్యోగ ప్రవేశం చేసిన శేఖర్‌బాబు త్రిపురాంతకం, వినుకొండ, బాపట్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పనిచేసి, 2011లో ప్రిన్సిపాల్‌గా పదోన్నతి పొందారు. రేపల్లె, పిడుగురాళ్ల కళాశాలలు, ఇంటర్ బోర్డులో కొంతకాలం పనిచేసిన తర్వాత 2021 నుంచి ఇప్పటి వరకు పెనుమాక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్‌గా వ్యవహరిస్తున్నారు. గతేడాది ఉత్తమ ప్రిన్సిపాల్ పురస్కారాన్ని రాష్ట్ర ప్రభుత్వం నుంచి అందుకున్నారు. జిల్లాలోని 19 ప్రభుత్వ, 2 ఎయిడెడ్ జూనియర్ కళాశాలల పాలనా వ్యవహారాలను ఈయన పర్యవేక్షిస్తారు. ఇంటర్మీడియట్ పరీక్షల్లో ఫెయిలైన విద్యార్థులకు నిర్వహించనున్న సప్లిమెంటరీ పరీక్షలకు తర్ఫీదునిచ్చేందుకు ఈ నెల 24 నుంచి అన్ని కళాశాలల్లో ఉదయం 9నుంచి సాయంత్రం 4గంటలవరకు ప్రత్యేక తరగతులను నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. కాగా శేఖర్‌బాబుకు ఇంటర్‌బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణాధికారి (ఆర్ఐవో) యోహాన్, డీవీఈవో, ఆర్ఐవో కార్యాలయాల ఉద్యోగ సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

ఈదర ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవం

ఆగిరిపల్లి, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి):ఆగిరిపల్లి మండలంలోని ఈదర మెయిన్ ఆదర్శ ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవంలో ముఖ్య అతిథులుగా మండల విద్యాశాఖ అధికారులు సర్వేశ్వరరావు, ఆనంద్‌కుమార్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మక్కె వేణుగోపాలరావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ దొండపాటి అనిత, స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్ ఎస్.శారద, ఎం.నిర్మలాదేవి, ఎస్ఎంసీ చైర్మన్ వనపర్తి రమేష్ పాల్గొన్నారు.

సమస్యలపై ప్రజాప్రతినిధుల గళం

ఆగిరిపల్లి, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి):స్థానిక మండల కార్యాలయంలో సోమవారం ఎంపీపీ గోళ్ళ అనూష అధ్యక్షతన ఏవో అబ్దుల్‌సలాం ఆధ్వర్యంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి మండల పరిధిలోని మండల ప్రాదేశిక నియోజకవర్గం సభ్యులు, సర్పంచ్‌లు, వివిధ మండలశాఖ అధికారులు పాల్గొన్నారు. పలు సమస్యల పై ప్రజా ప్రతినిధులు ప్రశ్నించారు. సంబంధించిన అధికారులు మాట్లాడుతూ సమస్యలను వెంటనే పరిష్కరిస్తామని తెలిపారు.

కృష్ణానదిలో యువకుడి గల్లంతు

బత్తులవారి గూడెంలో విషాద చాయలు


శ్యాంకుమార్ (ఫైల్)

నూజివీడు టౌన్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : స్నేహితులతో కలిసి విహారానికి ఆనందంగా వెళ్లిన యువకుడు కృష్ణానదిలో గల్లంతైన సంఘటనతో నూజివీడు మండలం బత్తులవారిగూడెంలో విషాద చాయలు నెలకొన్నాయి. వివరాల్లోకి వెళితే బత్తులవారిగూడెం గ్రామానికి చెందిన పావులూరి ప్రభాకర్‌రావు కుమారుడు శ్యాంకుమార్ (20) ఎన్టీయార్ జిల్లా గుంటుపల్లి రేవు వద్ద విహారానికి వెళ్ళాడు. స్నానానికి కృష్ణా నదిలో దిగగా నదిలో గల్లంతు అవడంతో అతని స్నేహితులు స్థానిక అధికారులకు సమాచారం ఇవ్వగా గాలింపు చర్యలు చేపట్టిన అధికారులు సోమవారం ఉదయం శ్యాంకుమార్ మృతదేహాన్ని వెలికి తీసి విజయవాడ ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం చేసి మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. దీంతో గ్రామంలో విషాద చాయలు అలముకున్నాయి.

బ్యానర్ల చించివేతపై ఫిర్యాదు

నూజివీడు టౌన్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): బ్యానర్ చించివేతపై నూజివీడు మండలం తుక్కులూరు గ్రామ టీడీపీ నాయకులు రూరల్ పోలీస్‌స్టేషన్‌లో సోమవారం ఫిర్యాదు చేశారు. గ్రామ సచివాలయం వద్ద నూజివీడు శాసనసభ్యులు రాష్ట్ర మంత్రి కొలుసు ప్రార్థసారథికి ఆహ్వానం పలుకుతూ ఏర్పాటు చేసిన బ్యానరును ఆదివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చించివేయడంపై గ్రామ తెలుగుదేశం పార్టీ నాయకులు అన్నే సురేశ్ రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. గతంలోనూ తెలుగుదేశం పార్టీ బ్యానర్లను గుర్తు తెలియని వ్యక్తులు చించివేశారని దీనిపై సమగ్ర విచారణ నిర్వహించాలని కోరినట్లు ఆయన తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్

మంచినీటి చెరువులు నింపాలి: ఎమ్మెల్యే కామినేని

కైకలూరు, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): వేసవిలో మంచినీటి ఎద్దడి రాకుండా ప్రతి చెరువును నింపాలని అందుకు ప్రత్యేక టీంలు రాత్రింబవళ్లు కాలువగట్లు వెంబడి పర్యవేక్షించాలని ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ అన్నారు. సోమవారం కైకలూరు మండల పరిషత్ కార్యాలయంలో నియోజకవర్గంలోని నాలుగు మండలాల ఎండీవోలు, తహసీల్దార్‌లు, జలవనరులశాఖ, ఆర్‌డబ్ల్యూఎస్, ఈవోపీ ఆర్డీలు, పోలీసు, రెవిన్యూ అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. కాలువలకు విడుదల చేసినందున ఎక్కడా నీరు చేపలచెరువులకు అక్రమంగా తరలిపోకుండా ఎక్కడికక్కడే కట్టడి చేసి శివారు గ్రామాల్లోని మంచినీటి చెరువులను యుద్ధప్రాతిపాదికన నింపాలని సూచించారు. అవసరమైన చోట్ల ఆయిల్ ఇంజన్లు, విద్యుత్ మోటార్లుతో చెరువులు నీటితో నింపేలా ఆయా గ్రామపంచాయతీ అధికారులు చొరవ చూపాలన్నారు. చెరువులు నింపడంలో అలసత్వం వహిస్తే చర్యలు తీసుకోబడతాయని హెచ్చరించారు. ఈ సందర్భంగా కాలువల్లో చెత్త వేసి కలుషితం చేస్తున్నారని పలువురు నీటి సంఘాల నాయకులు సమావేశం దృష్టికి తీసుకువచ్చారు.


విద్యుత్ మోటార్లను సీజ్ చేయిస్తున్న డీఎల్పీవో కె.పూర్ణచంద్రరావు

విద్యుత్ మోటార్లు సీజ్

కైకలూరు, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): కైకలూరు మండలం గోపవరం పంటకాల్వలో నీరు అక్రమంగా చేపల చెరువుకు తరలిస్తున్నట్లు గుర్తించి విద్యుత్ మోటార్లును, ఆయిల్ ఇంజన్లను సీజ్ చేశారు. ఈ సందర్భంగా డీఎల్పీవో కె పూర్ణచంద్రరావు మాట్లాడుతూ నీరు అక్రమంగా ఎవరు తరలించినా కేసులు నమోదు చేస్తామన్నారు. పంటకాల్వలకు నీరు విడుదల చేసింది ప్రజలు తాగునీటి అవసరాల కోసమని దీనిని రైతులంతా గుర్తించి అధికారులకు సహకరించాలన్నారు. అనంతరం మంచినీటి చెరువును, నరసాయిపాలెం చానెల్‌ను పరిశీలించారు.

నీటి ఎద్దడి నివారణకు ప్రణాళికలు : ఎంపీడీవో

నూజివీడు టౌన్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ ప్రాంతాలలో తాగునీటి ఎద్దడి నివారణకు తగిన ప్రణాళికలు సిద్ధం చేసినట్లు ఎంపీడీవో రాఘవేంద్రనాథ్ తెలిపారు. నూజివీడు ఎంపీడీవో కార్యాలయంలో ఆయన సోమవారం మాట్లాడుతూ వేసవిని దృష్టిలో ఉంచుకుని ఏ ప్రాంతంలోనూ నీటి ఎద్దడి తలెత్తకుండా తగిన జాగ్రత్త చర్యలు చేపట్టామన్నారు. అవసరం మేరకు తాగునీటికి కావల్సిన అన్ని సదుపాయాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే గ్రామీణ ప్రాంతాలలో సర్వే నిర్వహించి పైపులైన్లు ఏర్పాటు, కుళాయిలు మరమ్మతులు నిర్వహించామన్నారు. క్రమం తప్పకుండా వాటర్ ట్యాంకులను పరిశుభ్రం చేయడం జరుగుతుందన్నారు. అవసరం మేరకు ఇంటింటికి తాగునీటి సరఫరా కోసం ఏర్పాట్లు చేయనున్నట్లు తెలిపారు. ప్రధాన రహదారులలో ప్రజల అవసరార్థం దాహార్తిని తీర్చేందుకు చలి వేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. పల్లె ప్రాంతాలలో మోటార్లు, పైపు లైన్లు, బోర్లు, హ్యాండ్ పంపులు అన్నింటిని వినియోగంలోకి తీసుకువచ్చినట్లు చెప్పారు. ఎక్కడైనా సమస్యలు ఉంటే ఆయా గ్రామాలలోని సచివాలయాల సిబ్బందికి సమాచారం అందించాలన్నారు. అక్కడ సమస్య పరిష్కారం కాకుంటే తన దృష్టికి తీసుకువస్తే తక్షణమే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ప్రస్తుతం నీటి సమస్య పరిష్కారమే ప్రధాన అంశంగా ముందుకు వెళ్తున్నట్లు వివరించారు.

చేపల మేత దొంగల అరెస్టు

ఉంగుటూరు, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): రాచూరు, చుట్టుపక్కల గ్రామాల చేపల చెరువుల వద్ద నిల్వ ఉంచిన మేత బస్తాలను దొంగిలించిన ఆరుగురిని అరెస్టు చేసినట్లు చేబ్రోలు ఎస్ఐ ఎం.సూర్య భగవాన్ తెలిపారు. వీరిని అరెస్టు చేసి సోమవారం నాడు తాడేపల్లిగూడెం కోర్టులో హాజరు పరచగా 14 రోజుల రిమాండ్ విధించారు. రైతు నడింపల్లి రామాంజనేయ వర్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు జరిపి సీతారాంపురానికి చెందిన బైరపూడి హరికృష్ణ, వనపర్తి సహదేవుడు, తాడేపల్లి వెంకట కుమార్, జుత్తుక ధనుష్, జుత్తుగ పవన్ కుమార్, నగివేరి జయ రాజులను అరెస్టు చేసినట్లు తెలిపారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	127, 136, 147
చికెన్ విత్ స్కిన్	240
చికెన్ స్కిన్‌లెస్	250


నెక్ కోడి గుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ.475

నియోజకవర్గాల్లో ఇసుక స్టాక్ పాయింట్లు

జిల్లా అధికారుల సమావేశంలో ఇన్‌చార్జి మంత్రి నాదెండ్ల మనోహర్

ఏలూరు, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని నియోజకవర్గాల్లో ఇసుక స్టాక్ పాయింట్లు అందుబాటులో ఉండేలా చూడా లని, వేసవి, వర్షాకాలం అవసరాలకు ఇసుకను సిద్ధం చేసుకోవాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రి నాదెండ్ల మనోహర్ అధికారులను ఆదేశించారు. ప్రతీ స్టాక్ పాయింట్ల వద్ద లక్షల మెట్రిక్ టన్నుల నిల్వలు ఉంచాలని సూచించారు. ఏలూరు కలెక్టరేట్‌లో మంత్రి కొలుసు పార్థసారధి, జిల్లా కలెక్టర్, ఎమ్మెల్సీలతో పలు అభివృద్ధి అంశాలపై సోమవారం రాత్రి నాదెండ్ల మనోహర్ సమీక్షించారు. ప్రస్తుత వేసవిలో నిర్మాణ పనులకు అనుకూలమని, జిల్లాలో పేదల ఇళ్లకు ఉచిత ఇసుకను అందుబాటులో ఉంచాలన్నారు. వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా అన్ని ముందస్తు చర్యలు తీసుకోవాలని, మరమతులు అవసర మైన చోట్ల బోర్లు వేసి సమస్య లేకుండా చూడాలన్నారు. తాగునీటి చెరువులకు పూర్తి స్థాయిలో నీరు నింపుకునేందుకు ఈ నెల 25వ తేదీవరకు కాల్వలు నీటి విడుదల చేస్తా మని, ఆ తర్వాత కట్టేస్తారని మంత్రి చెప్పారు. జాతీయ ఉపాధి హామీ పథకంలో కోటి 20 లక్షలు పనిదినాలు లక్ష్యంగా కాగా ఇంతవరకు కోటి 60 లక్షల పనిదినాలు కల్పించామన్నారు. మంత్రి కొలుసు పార్థసారధి మాట్లాడుతూ పేదల ఇళ్ల నిర్మాణాలు, వ్యక్తిగత నిర్మాణాలు పునాదులు పూడిక అవసరాలను మట్టిని తీసుకునేందుకు అనుమతించాలన్నారు. కైకలూరు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ మాట్లాడుతూ తమ నియోజకవర్గంలో శివారు ప్రాంతాల్లో తాగునీటి సమస్యను పరిష్కరిం చాలన్నారు. ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ మాట్లాడుతూ 2019లో గ్రామంలో నిర్మించిన గ్రామసమాఖ్య భవనాల నిర్మాణాలకు బిల్లుల చెల్లింపు జరిపేలా చూడాలన్నారు. బడేటి చంటి మాట్లాడుతూ పేదల ఇళ్లకు పునాదుల పూడిక అవసరాలకు మట్టిని తీసుకునేందుకు అనుమతులు ఇవ్వాలన్నారు. ఎమ్మెల్సీ పేరా బత్తుల రాజశేఖరం, ఎమ్మెల్యే వత్సవాయి ధర్మరాజు, కలెక్టర్ వెట్రిసెల్వి, జేసీ పి.ధాత్రిరెడ్డి, డీఆర్వో విశ్వేశ్వరరావు, ఆర్డీవో అచ్యుత్ అంబరీష్ పాల్గొన్నారు.


నియామక పత్రం అందుకుంటున్న చాగంటి నరసింహారావు

ఐయుకేఎఫ్ రాష్ట్ర కార్యాలయ కార్యదర్శిగా చాగంటి

చాట్రాయి, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని పోలవరంకు చెందిన విశ్రాంత ఆర్టీసీ ఉద్యోగి చాగంటి నరసింహారావు ఇంటర్నేషనల్ యునైటెడ్ కలాం ఫౌండేషన్(ఐయుకేఎఫ్) ఏపీ రాష్ట్ర కార్యాలయ కార్యదర్శిగా నియమితులయ్యారు. ఇటీవల తమిళనాడులోని మధురై జేపీ ఇండోర్ స్టేడియంలో జరిగిన ఐయుకేఎఫ్ జాతీయ సదస్సులో ఏపీ రాష్ట్ర కమిటీని వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ సెంతూర్ పాండియన్ నియామక పత్రాలు అందజేసినట్లు నరసింహారావు చెప్పారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ముదినేపల్లి, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు మరమ్మతు పనుల కారణంగా ముదినేపల్లి ఫీడర్ ఏరియాలో సోమవారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు సెక్షన్ ఏఈ పూర్ణచంద్రరావు తెలిపారు. ఆ ఫీడర్ పరిధిలోని ఆక్వా, గృహ, వాణిజ్య విద్యుత్ వినియోగదారులు ఈ విషయాన్ని గమనించాలని కోరారు.

పచ్చిరొట్ట సాగుతో భూసారం పెంపు: ఏవో

చాట్రాయి, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): పచ్చిరొట్ట సాగు ద్వారా రైతులు భూసారాన్ని పెంచుకోవాలని వ్యవసాయాధికారి బి.శివశంకర్ రైతులకు సూచించారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌కు 50 శాతం సబ్సిడీపై జీలుగ, జనుము, పిల్లి పెసర విత్తనాలు రైతుసేవా కేంద్రాల ద్వారా రైతులకు పంపిణీ చేయటానికి ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు.


కళా వేదికను ప్రారంభిస్తున్న హెచ్ఎం శ్రీనివాస్

విశ్రాంత ఉపాధ్యాయుడి సహకారంతో కళావేదిక

ముసునూరు, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): వేల్పుచర్ల జడ్పీ పాఠశాల విశ్రాంత ఎస్ఏ ఆంగ్ల ఉపాధ్యాయుడి ఆర్థిక సహకారంతో నూతనంగా నిర్మించిన కళావేదికను సోమవారం ప్రధానోపాధ్యాయులు ఎం.శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ దాత కె.వి నారాయణ తన తల్లిదండ్రులు వీరాస్వామి, వెంకట సుబ్బమ్మ జ్ఞాపకార్థంగా రూ.2లక్షలతో పాఠశాలకు కళావేదిక (స్టేజి)ని నిర్మించినట్లు హెచ్ఎం తెలిపారు. ఈ సందర్భంగా దాత నారాయణ మాస్టారుని పాఠశాల ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు అభినందించారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య


రమణక్కపేటలో అడ్మిషన్ పత్రాన్ని ఇస్తున్న నాయకులు, ఉపాధ్యాయులు

ముసునూరు, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతోపాటు ఉచిత సౌక ర్యాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ కొం డా దుర్గాభవాని, నియోజక వర్గ జనసేన నాయకులు పాశం నాగబాబు అన్నారు. సోమవారం రమణక్కపేటలో జడ్పీ పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామకృష్ణారావు ఆధ్వర్యంలో బడిపిలుస్తోంది ఇంటింటి క్యాంపెయిన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులతోపాటు నాయకులు సైతం ప్రతి ఇంటికి వెళ్ళి తల్లిదండ్రులతో మాట్లాడి పాఠశాలలో చేర్పించుకునేందుకు అడ్మిషన్ పత్రాలను అందజేశారు.

25న బలివే ఆలయ భూముల కౌలు వేలం పాట

ముసునూరు, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): బలివే రామలింగేశ్వరస్వామి ఆలయానికి సంబంధించిన వ్యవసాయ భూములకు ఈ నెల 25వ తేదీ మధ్యాహ్నం 2.30 గంటలకు ఆలయ ప్రాంగణంలో బహిరంగ వేలంపాట నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో వై.అలివేణి శ్రీనాగలక్ష్మి దేవి సోమవారం తెలిపారు. మూడు సంవత్సరాల కాలపరిమితిన బలివేలో ఉన్న ఆర్‌యస్ నెంబర్ 186లో 7ఎకరాలకు రూ.14వేలు, ఆర్‌యస్ నెంబర్ 91లో 4.52 ఎకరాలకు రూ.9వేలు, ఆర్‌యస్ నెంబర్ 97-2లో 1.66 ఎకరాలకు రూ.4వేలు, ఆర్‌యస్ నెంబర్ 167లో 1.77ఎకరాలకు రూ.4వేలు ధరావత్తుగా చెల్లించి పాటలో పాల్గొనాలని ఈవో తెలిపారు.

ఇళ్ల స్థలాలకు దరఖాస్తు చేయండి

కలిదిండి, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): ఇళ్ల స్థలాల పట్టాల కోసం అర్హులైన లబ్ధిదారులు గ్రామ సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ రామకృష్ణ తెలిపారు. దరఖాస్తుదారుల సంఖ్యను బట్టి ఆయా గ్రామాల్లో ఇళ్ల స్థలాలను ప్రభుత్వం కేటాయిస్తుందన్నారు. గ్రామాల్లో మూడు సెంట్లు, పట్టణాల్లో రెండు సెంట్లు చొప్పున ఇస్తారన్నారు.

రెండు చోట్ల ధాన్యం కొనుగోలు కేంద్రాలు

నూజివీడు టౌన్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : నూజివీడు మండల పరిధిలో రెండు ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టినట్లు నూజివీడు మండల వ్యవసాయశాఖ అధికారి ఆలూరి చాముండేశ్వరి తెలిపారు. సోమవారం ఆమె మాట్లాడుతూ మండలంలో 150 ఎకరాలలో వరిసాగు జరిగిందన్నారు. మే మొదటి వారంలో వరికోతలు ప్రారంభం అవుతాయని రైతులు ధాన్యాన్ని గిట్టుబాటు ధరలకు అమ్ముకునేందుకు అవకాశం కల్పిస్తూ పోతురెడ్డిపల్లి, తుక్కులూరు గ్రామాలలోని రైతు సేవా కేంద్రాలలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. పూర్తి వివరాలు కోసం రైతు సేవా కేంద్రాలలో లేదా వ్యవసాయ శాఖ కార్యాలయంలో రైతులు సంప్రదించవచ్చు అన్నారు.